# అరుంధతీ వసిష్ఠము

[ పద్య కావ్యము ]

విద్వాన్, బులుసు వేంకటేశ్వరులు, బి. ఏ.

UNIVERSAL LIBRARY
OU_204497
UNIVERSAL LIBRARY

# అరుంధతీవసిష్ఠము

కావ్యకర్త:

బులుసు వేంకటేశ్వరులు.

బి. ఏ., విద్వాన్.

1953 జనవరి

నందన పుష్య బహుళము. [సంక్రాంతి]

మూల్యము

రు 1.

ప్రకాశకులు :

వి. పి. అండ్ సన్సు,

రామారావు పేట, కాకినాడ.

ముద్రాపకులు :

ఆంధ్రప్రచారిణీ ప్రెస్, కాకినాడ.

# అరుంధతీవసిష్ఠము

## పీఠిక

శ్రీమహనీయరూపుఁడు వశీకృతచిత్తుఁడు నిర్జితేంద్రియ
గ్రాముఁడు సిద్ధసాధనుఁడు కర్మరహస్యవిదుండు జ్ఞానతే
జోమయుఁ డార్యపూజితుఁడు సూనృతవాఙ్మ మహేశసన్నిభ
శ్రీమహితుండు మద్గురువిశిష్టపదంబుల నాశ్రయించెదన్. ౧

చ. కొలిచినవారి కెల్లరకుఁ గోరిక లిచ్చెడుకల్పవృక్షమై
తలఁచినవారి నెల్లరను ధన్యులఁ జేసెడు యోగమూర్తియై
తెలచెడువారి నెల్లరను దివ్యులఁ జేసెడు జ్ఞానరాశియై
విలసిలుమద్గురూత్తముని విశ్రుతపాదము లాశ్రయించెదన్. ౨

శా. నిష్కామప్రభుతాత్ముఁడై వెలయుచున్ నిత్యోత్సవశ్రీమహా
విష్కారంబున నెల్లవారలను దృప్తింబొందఁగాఁ జేయుచున్
నిష్కామక్రియమాణ సంతత మహానిర్నిద్ర సంచారియై
దుష్కామాంతకుఁడైన మద్గురుని గొల్తున్ సర్వసంసిద్ధికిన్. ౩

మ. గురుసంపూజన మాచరింపఁ గలభక్తుండౌను శక్తుండు మో
క్షరమన్ జేకొన గుర్వనుగ్రహము యూఁ గామ్యార్థసంసిద్ధిస
త్వరమార్గంబు, గురుం డనంగ శివుఁడే తథ్యంబు కానన్ మహే
శ్వరుఁ డౌమద్గురుదేవుపాదముల నద్వైతస్థితిన్ గొల్చెదన్. ౪

చ. గురుకృప మున్నుఁ గావ్యములఁ గూర్చితిఁ జేర్చితిఁ దత్పవిత్రస
చ్చరణపయోజమూలమున జన్మము ధన్యము గాఁగ నింకనొం
డరసి రచించి కావ్యముఁ గృపాంబుధి నాతనిఁ బూజచేయఁగాఁ
దొరఁగితి; దైవపూజకును దోయజసంతతి కెక్కుడున్నదే? ౫

సీ. కావ్యంబు పరమార్ధకారణం బనియును
నది గురూత్తమునకు నంకితమని
గురుదేవ సంసేవ పరమౌషధం బగు
భవరోగముల కన్న భావమునను
బుద్ధివికారముల్ పోడమకుండుటకు స
త్కాలవ్యయంబె మార్గం బనియును
సరససారస్వత పరివస్య యనియును
మిత్రవాంఛను దీర్చ మే లగు నని

గీ. బాహ్యహేతువు లిన్నిటఁ బాఱఁద్రోలు
గురుకటాక్షము నాపైని బరగి యిట్టు
లీసపర్యను గొనఁగ విలాస మనియుఁ
గావ్యము రచింపఁ దొరఁకొంటి నవ్యముగను. ౬

గీ. సర్వగీర్వాణకవుల కంజలి ఘటించి
నన్నయను దిక్కనను గొల్చి యున్న పెక్కు
రాంధ్రకవివర్యులకు జోహారు లొసఁగి
వాక్పవిత్రతఁ బడసి కావ్యం బొసర్తు. ౭

మ. కవితావస్తు వరుంధతీ ఘటజలోకశ్రేష్ఠవృత్తాంతమై
చవు లూరించుఁ బఠింబఠిం జదువ; శశ్వత్పుణ్యసంవర్ధకం
బవు విన్నన్ దలపోయ మెచ్చ; నిఁక భాగ్యంబున్నె వేఱొండు స
త్కవికావ్యంబుఁ బఠించుకంటె నని విఖ్యాతిన్ జనం బెంచుతన్.

మ. చిరకాలంబు ధనాధికారిజనులన్ సేవించి సేవించి త
త్పరతన్; స్వల్పధనాధికారములు సంప్రాప్తింప జీవించి; యీ
ధరపైఁ బేరును బెంపుఁ గాని జనికిన్ ధన్యత్వముం గాని మో
క్షరమన్ గైకొనుబుద్ధిఁ గాని కనమిన్ జన్మంబు వ్యర్థంబగున్. ౯

చ. జననపరంపరాంబుధిని జక్కఁ దరింపఁగ నుద్యమించి సా
ధనఘనసిద్ధిఁ గాంచుట ముదంబొ వ్యథామయమోహవాగురన్
బెనఁగొని స్రుక్కుటల్ సుఖమొ నిక్క మెఱుంగరు మూఢమా
నవుల్;
వినుతవివేకు లెంతయును లెస్స గణింతురు జ్ఞానసంపదన్. ౧౦

శా. ప్రాచీనార్యఋషీశ్వరుల్ మును బరబ్రహ్మంబుఁ బ్రాపించి య
ర్వాచీనప్రజకున్ మహోపకృతిగాఁ బ్రజ్ఞానతత్త్వంబులన్
సూచింపంగఁ దదీయసచ్చరితముల్ సూక్ష్మంబుగాఁ జూచినన్
బ్రాచుర్యం బగు జ్ఞానతత్త్వ మని సంభావింతు నేతత్కథల్. ౧౧

మ. తలపోయం దరమే వసిష్ఠునిమహత్త్వం బేరికైనన్!; దదం
ఘ్రులు సేవించి మహాపతివ్రత యనన్ లోకంబులన్ దివ్యకీ
ర్తుల వెల్గొందు నరుంధతీసతి నహా! స్తోత్రింపఁగా శక్యమే?
పలుకుల్ వేయును నేల వారిస్మృతియే భాగ్యంబు లోకాళికిన్.

చ. గురుకృపకల్మి వారి నిటు కోరి స్మరించెడుభాగ్య మబ్బె మ
ద్గురుకృప కీడు లేదు; పరితోషము కల్గదు వేఱొకంట; త
ద్గురువరుపూర్ణసత్కృపకు దోయిలిపట్టెద భక్తితో నిరం
తరమును; దాన నీఁగెద వ్యథల్ చరితార్థతఁ గాంచ జన్మమున్.

మ. కవితాకన్య వరించియుండు టొకభాగ్యం; బెన్న నాపైని యా
కవితాకన్యక నుత్తమర్షిజనసద్గాథాప్రకారంబులన్
మిపులన్ దన్పుట భాగ్య; మాతరుణి నుప్రేమంబునన్ సద్గురు
ప్రవరశ్రీపదసేవ నిల్పుట మహాభాగ్యంబు నిక్కంబుగన్. ౧౪

చ. కవి యయి సత్కథాగణముఖంబునఁ దత్త్వదధిన్ మథించి యిం
పవునవనీతమున్ బ్రజల కందఱి కందఁగఁ జేసి జన్మమృ
త్యువుల జయింప నెల్లరకుఁ దోడ్పడఁగావలెఁ గాని యాజవం
జవమునఁ గూల్చు కాల్చువిరసం బగుగాథల వ్రాయఁ జెల్లునే?

చ. గసికులు వారె సర్వగుణరక్తులు వారె విరక్తచిత్తులై
యొసఁగినపుణ్యమూర్తులును నెన్నఁగ వారె విరాగరాగులై
విసమునసే మహామృతము పింపినవారును వారె యట్టితాపస
రసికావతంసులను భక్తిఁ దలంచెద జ్ఞానభిక్షుకై. ౧౬

క. ముక్తిసతీనవయౌవన, రక్తుని జ్ఞానప్రకాశరమశృంగారా
సక్తర్షిప్రవరు యథా,శక్తిని స్మరియింతుగురుని షష్ఠ్యంతములన్.

క. కమనీయాద్భుతరూపునకు, కమలప్రజ్ఞానచక్షుఁడౌపుణ్యునకున్
కమలాసనకమలప్రియ, కమనీయకపాలపాణికారుణ్యునకున్. ౧౮

క. ఆత్మేంద్రియనిగ్రహస, ర్వాత్మునకున్ గామకామహార్యక్షునకున
ఆత్మీయశిష్యగణపర, మాత్మునకున్ సతతపరమహర్షాంబుధికిన్.

క. కరుణాకరపరమాదర, సరసాలాపప్రకారసర్వజ్ఞునకున్
నరనారాయణపరమే, శ్వరమూర్తికిఁ బ్రాపు ప్రోపు భగవం
తునకున్. ౨౦

క. శిష్యశ్రీశైలమహా, ముష్యాయణగిరికి స్పర్శముఖవేదికి సం
పోష్యబహుశిష్యయుతునకు, బుష్యగ్రణి కఖిలవిబుధబుధభంబు
నకున్. ౨౧

క. జ్ఞానాబ్ధిశీతకిరణునకు, కానందసుధాప్రవర్షకాంబుదమునకున్
నానాగమసారామృత, పానంబున విఱ్ఱవీఁగుబ్రహ్మణ్యునకున్. ౨౨

క. పట్టింబగ్గము లేకయె, నట్టడవిని నింగి వేల్పునగరులలోనన్
ముట్టక యంటక చను జగ, జెట్టికిఁ బుట్టువుల నీఁగుసిరిమంతు
నకున్. ౨౩

క. తెలుపుల మేటికిఁ బలికిన, పలుకులఁ దేనియలు జాలువాఱించెడి ని
చ్చలపుందబిసికొలంబున, బలుప్రోడగఁ బుట్టుగొన్నబమ్మరుసికినిన్.

వ. అంకితంబుగా మదభ్యుదయ పరంపరాభివృద్ధి నిమిత్తంబుగా
నే నొనర్పంబూనిన "అరుంధతీవసిష్ఠము" నకుఁ గథాక్రమ
మెట్టి దనిన. ౨౫

## —: కథా ప్రారంభము :—

శ్రీకమలాసనుండు నిజసృష్టిసువర్ధన మాచరింప న
స్తోకముదంబునన్ హృదయతోయరుహంబున నుండి బ్రహ్మతే
జోఽకుటిలాత్మవిగ్రహుల సుస్థిరచిత్తులఁ భావనాత్మసు
శ్లోకుల సృష్టిచేసె నవసుందర దేహుల బ్రహ్మనిష్ఠులన్. ౨౬

ఉ. యోగసమాధియుక్తము మహోజ్జ్వల మైనతపోవిశేషమున్
త్యాగవిరక్తియుక్తమును ధన్యము నౌనిజదేహ మిచ్చి నా
నాగమవిజ్ఞతాఖిల మనంతముగాఁగ ననుగ్రహించి తే
జోగరిమం బొసంగి కృపఁజూచెను వారల నవ్విరించియున్. ౨౭

ఉ. వారలలోన నెన్న సరివారలె లేని తపోమహత్త్వవి
స్ఫారుఁడు రూపమన్మథుఁడు పంకజనాభుననుంగునై జగ
ద్భారము సృష్టిభారమును దాల్చి ప్రజాపతి నాఁగ ఖ్యాతిఁ బెం
పారినసత్తపోధనుఁడు భవ్యుఁడు కర్దమమౌని యొప్పెడున్. ౨౮

చ. అతఁడు సరస్వతీతటమునందలి దివ్యవనప్రదేశ సం
స్థితి బహువత్సరంబులు విశేషతపం బొనరించె; నంత నం
చితముగ విష్ణుమూర్తి కృప చేసెను దర్శన మిచ్చి దుర్దమ
వ్రతతనుమర్దన ప్రబలవర్ధన విష్ణుని కర్దమర్షినిన్. ౨౯

క. ఆపరమాత్మకటాక్షము, ప్రాపింపఁగ భక్తియుక్తి భయసాధ్వసశో
భాపరవశుఁడై పలికెను, గాఁపట్య మొకింత లేనిఘనభక్తిహృదిన్.

సీ. "పరమేశ ! నీకృపఁ బడయఁగలేడివాఁడె
బ్రతుకుఫలంబును బడయువాఁడు
పుండరీకాక్ష ! నీపొత్తిం గెడివాఁడె
బ్రహ్మప్రబోధంబుఁ బడయువాఁడు

లక్ష్మీశ ! నిన్నువలక్షింపఁగలవాఁడె
పరమేశ్వరుం డయి పరగువాఁడు
పద్మప్రియా ! నిన్ను భావింపఁగలవాఁడె
తాఁ బరబ్రహ్మమై తనరువాఁడు
గీ. ఆదిపూరుష ! నిన్ను నే నరయఁగంటి
భక్తవత్సల! నిన్ను నేఁ బడయఁగంటి
ధన్యమయ్యెను మజ్జని తావకీన
దివ్యదర్శనభాగ్య సందీప్తి కతన. 3౧

క. శరణంబందెదఁ ద్వత్పద,సరసీరుహయుగళిఁ జేరి సమ్యక్కృప న
న్నరయుము నీవానిగ నో,పరమాత్మా! దేవ దేవ! భవభయదూరా!

సీ. ఏయుగమ్మునసైన నిందిరారమణ ! నిన్
దలపోయు టే ఘోరతపము కాదె?
అంబుజోదర ! నిన్నె యర్చించు టే కదా
యోగఫలంబును త్యాగఫలము
కమలదళాక్ష ! సంయమిలోకసామ్రాజ్య
పట్టభద్రత భవద్వందనంబు
లోకేశ ! నిన్నుపశ్లోకించు టే బ్రహ్మ
నిర్వాణపద మగు నిశ్చయంబు
గీ. గరుడవాహన ! కౌస్తుభాభరణ ! శంఖ
చక్రధారణ! నిన్గని సఫలమయ్యె
మామకీనభవంబు ; రమ్యత్వదీయ
రూపదర్శన మొసఁగు సారూప్యఫలము." 33

క. అనిపెక్కుగతులనాతఁడు,వినుతింపఁగవిష్ణుమూర్తి ప్రియమునవత్సా!
ననుఁ దలఁచినకార్యం బే,"మని యడిగినఁ గర్దమర్షి యనె
భక్తి మెయిన్, 3౪

గీ. "దేవ దేవ! యెఱుంగవె నీవు సర్వ;
మేను బలుకంగ వినుట నీ కిచ్ఛయయ్యె
నేని బలుకుదు బలికింప నీవు తండ్రి!
అవ్యయానంద సంధాయకాగ్రగణ్య! 3౪

గీ. నలువ సృష్టించి యాత్మనందనుల; వారి
జీవసంతతి సృష్టింపఁ జేసె నాజ్ఞ;
ఆనియోగిజనంబు లధ్యాత్మచింత
మునిఁగియుండంగఁ గోపించి యనియె నలువ. 3౫

గీ. 'ఈనియోగిజనంబులు నా నియోగ
మేమఱిరి; సృష్టికార్య మిం కేమిగాను?
పరమపాపులు వట్టినిర్భాగ్యు లైరి
గోముఖవ్యాఘ్రము' లటంచుఁ గోపపడఁగ. 3౬

గీ. వార లాతనిశాపంబుబారిఁ బడఁగ
నిచ్ఛగింపక పెండ్లాడి సృష్టికార్య
నిర్వహణు లైరి; మఱి నేను నీరజాక్ష!
నీయభిమతంబుఁ దెలియంగ నిశ్చయించి. 3౭

క. తప మొనరించితి దేవా!, కృపచూపితి వీవు నన్నుఁ గించిజ్ఞుని నీ
సుపదంబు లాశ్రయించిన, కృపణుని న న్ననికరించి యిమ్మాత్మజ్ఞ
ప్రభూ! 3౮

మ. నలసారం బగుసంసృతిం బడి యనంతా! కామలోభాదికం
బులచేతన్ హతులై నశింతురుగదా! పుణ్యాత్ములుంగూడ నీ
విలసత్పాదము లాశ్రయించిరె మహావిజ్ఞానపుంబల్మి నేఁ
జలుపం జూచెద జీవయాత్రను సరోజాక్షా! యకామ్యాత్మతన్".

క. అని విన్నవించు కర్దముఁ
గనుఁగొని "మునిచంద్రమా ! యకల్మష మగునీ
ఘనచిత్తవృత్తి యెఱుఁగుదుఁ
బనిగొనుమా బ్రహ్మయాజ్ఞ భద్రంబు లగున్. ౭౧

క. స్వాయంభువమనుపుత్త్రిక
నీయందనురాగ మూని నెగడును దానిన్
జాయంగాఁ గైకొను మది
శ్రేయం బగు నీకు మౌనిశేఖర ! మఱియున్. ౭౨

సీ. సౌందర్యసౌజన్యసౌభాగ్యసంపదా
స్పద లౌచు నుత్తమచరిత లగుచు
త్రిభువనఖ్యాతలై దివ్యర్షి చంద్రమ
పాణిగృహీతులై భవ్య లగుచు
పరమపతివ్రతాతరుణీ లలామలై
యుత్తమబహుపుత్త్రయోగ్య లగుచు
అన్వయాలంకార లై సాధువర్తన
లోకకల్యాణసుశ్లోక లగుచు

గీ. వెలయఁ గలవట్టి తొమ్మండ్రు లలన లుద్భ
వింపఁగలరు భవద్వీర్యవిలసిత యగు
ధర్మపత్నికిఁ, బిదప నుత్తమమునీంద్ర !
నేన జన్మింతు సుతుఁడనై నిక్కువముగ. ౭౩

క. ధ్యానించెదె మనసు నిల్పుము
నాయం దర్పింపు మఖిలనాథుఁడ ననుచున్
నీయజ్ఞఫలాదికమును
మాయాతిమిరంబుఁ జీల్చు మహితవివేకా ! ౭౪

గీ. చావుఁబుట్టువు లెఱుఁగనిజాణ నయ్యు
నిన్ను నీజాయఁ బ్రోవఁగా, నిలుప సాంఖ్య
తత్త్వము జగంబునన్ నాకుఁ దలఁపు కలుగ
నాత్మలీలార్థమై పుట్టు వందఁగలను.” ౪౫

మ. అని విష్ణుప్రభు వాత్మధామమున కత్యాశ్చర్యలీలన్ సుప
ర్ణునిపై నెక్కి యదృశ్యమయ్యె; మునిశార్దూలుండు నా కర్దముం
డనఘాత్ముండు ప్రియంబునం జనియె బ్రహ్మానందనిష్యందమై
చనునాబిందుసరోవరంబునఁ దపశ్చర్యాదికార్యార్థమై. ౪౬

శా. అంతం గర్దమసూని యంచితతపోధ్యానానురక్తుండు ని
శ్చింతాస్వాంతుఁడు బ్రహ్మచర్యనియమశ్రేష్ఠుండు సర్వేశ్వరా
నంతప్రాభవదృగ్విలాసుఁడు జగన్నాథార్చితాంతర్యవే
దాంతజ్ఞానకృశాంగసుందరుఁడు బ్రహ్మానందియై యుండఁగన్. ౪౭

క. స్వాయంభువమను వాత్మ
ప్రేయసి శతరూపతోడఁ బ్రియకామగుణ
శ్రీయుత యగునాత్మజతో
నాయెడ కేతెంచి మ్రొక్కె నతిభక్తిమెయిన్. ౪౮

ఉ. మ్రొక్కినయంతఁ గర్దముఁడు మోదముతోడ బహూకరించి పెం
పెక్కినయాతిథేయమున నెంతయు వారికిఁ బ్రీతిగూర్చియున్
మక్కువ నాదరించె మనుమాన్యుని సర్వసపర్యలన్; గనన్
దక్కువయే మునీంద్రులకు ధార్మికరక్తియు భక్తియుక్తియున్. ౪౯

గీ. కర్దమునిఁ గాంచి యానందకలితుఁ డగుచుఁ
బలికె స్వాయంభువుండు సభక్తికముగ
వినయగౌరవభావంబు విశదపడఁగ,
చల్లకును వచ్చి ముంత దాఁచఁడు వివేకి. ౫౦

మ. "వరయోగీశ్వర! దేవహూతి యను శోభారాశి మత్పుత్త్రి నీ
కరకాంక్షన్ జనుదెంచియున్నది కనంగా నొల్ల దేమానవుల్
వర మీవే కృప నీవె కైకొనఁగ సర్వశ్రేష్ఠుఁడౌ భర్త వీ
తరుణీశ్రేష్ఠమ; కింక నీవొసఁగు మోదంబంది యామోదముల్" ౫౧

క. అని వేడుకొనఁగఁ గర్దమ
ముని తొంటి విష్ణువాక్యమును స్మరియింపం
గని యిది లలాటలిఖితం
బని, తెలిపెను వినయగరిమ నామోదంబుల్. ౫౨

గీ. తెలిపి "మనువర్య! సమయము కల దొకండు
నాకు నీపుత్త్రివలన సంతతి జనించు
వఱకు నిలిచెద గార్హస్థ్యపథమునందుఁ
బిదపఁ గైకొందు సన్న్యాసవృత్తి నేను. ౫౩

గీ. దీని కొడఁబడితేని యింతియును నీవు
భవ్యగుణవతి యైనయీభాగ్యరాశిఁ
గైకొనఁగ నాకుఁ బ్రీతియే కానఁ దెలుపు
యుష్మదభిమత" మని పల్కె యోగ్యభంగి. ౫౪

క. సతితలఁపు తనదుతలఁపును
సుతతలఁపును నొక్కభంగి సొంపలరుటచే
మతి సంతసించి యాశా
లత చిగిరింపంగ మనువు లలితగతి ననెన్. ౫౫

ఉ. "మానివతంస! నీపలుకు మాకు మహాసుఖసిద్ధిఁ గూర్చె నెం
దేని పవిత్రవిప్రులకు నిట్టివ్రతంబె కదా యనారతంబునుం
బూనఁగ ధర్మ; మిట్టియెడఁ బూజ్యుఁడ వన్నిటఁ గాన నీకు నెం
తేని తగున్ మహాత్మ! యిది యెంతయు మాకు ననుగ్రహంబెయౌ.

క. మాపుత్త్రిఁ జెట్టవట్టిన
యాపుణ్యుఁడు పుత్త్రివంతుఁడై యాపిదపన్
శ్రీపుండరీకనయనుని
బ్రాపింపఁగ సన్న్యసింప భావ్యమ కాదే? ౫౮

చ. తొలియొకనాఁడు మేడపయిఁ దొయ్యలి నెచ్చెలికత్తెలాలతోఁ
గలఁగవగూడి లీలమెయిఁ గుందనపుందనుకాంతి యొప్ప నిం
పులు గులుకన్ ముఖాంబుజము పొల్పుగ కందుకకేళి నుండ నా
నం నెటనుండియో పడియె వచ్చి యొకండు క్షమింపఁగోరుచున్.

క. చెలికత్తియ యొక్కతె య
మ్మొలకశ్రుత వచ్చి విషయమును జెప్పఁగ మే
మల శరవేగంబునఁ జం
చలియించినచిత్తవృత్తిఁ జని కనుఁగొనఁగన్. ౫౯

గీ. అతఁడు గంధర్వజాతికి నధిపుఁడైన
వ్యక్తి విశ్వావసుం డనువాఁడు మమ్ముఁ
గాంచి వినయాంజలులను జోడించి పలికె
నిష్కలుష చిత్తవృత్తి నిర్నిద్రుఁ డగుచు. ౬౦

ఉ. "ఏమని చెప్పుకొందును మహీశ్వర! యోమనుసార్వభౌమ! నే
నీముదితన్ విమానమున నేఁగుచుఁ గంటిని గన్నయంతనే
నామది మోహమగ్నమయినన్ వివశంబయిపోయె వెంటనే
యీమహిఁ గూలిపోయితి నహీనపులజ్జ క్షమింపవేఁడఁగన్. ౬౧

ఉ. ఎంతపతివ్రతాతిలక మీనవమోహనమోహనాంగియో
యంతయుఁ దోఁచె నిట్లయినయంతనె బుద్ధియు వచ్చెఁ గాన ని
శ్కాంతపదాంబుజద్వయముఁ గాంచి తరింపఁగ దోషవార్ధి ని
శ్చింత యథేచ్ఛ మేఁగెదను శిష్యుని నన్ను ననుగ్రహింపవే! ౬౨

క. అని పలికిన విని మేమును
మనమున నచ్చెరువు దోఁప మహితాదరసం
జనితానందుని నాతనిఁ
గనికరమునఁ బంపఁ జనియె గంధర్వుండున్. ౬౩

ఉ. కావున మానిచంద్రమ! ప్రకాశిలు నీమె త్వదీయపత్నిగా
భావనసేయు నిన్నె భగవంతునిగా సతతంబు; నిట్టిక
న్యావరభిక్షఁ గైకొనుము; నన్ను నొనర్పుము ధన్యకాంక్షిగా
పావన మస్మదీయమనువంశము యుష్మదనుగ్రహంబునన్. ౬౪

గీ. కర్దమమునీంద్రుఁ డెంతయుఁ గౌతుకమునఁ
దెలుపఁగ నిజానుమతము; నుత్కృష్టఫణితి
మనుకులాచారవిహితధర్మప్రకార
మునను మునికిచ్చె దేవహూతిని జనకుఁడు. ౬౫

చ. మునికులసంప్రదాయమున మోదముతో మునిచంద్రుఁ డుత్తమం
బును గృహస్థోపయోగమును భోజ్యమునై నిజకర్మనిష్ఠ క
త్యనుగుణ మైనయాశ్రమము నం దిటు చొచ్చెను; ధర్మదీక్ష కెం
దును బరివర్జనీయమును దూష్యమునున్నదె యాశ్రమంబులన్. ౬౬

సీ. తనకీర్తి యాచంద్రతారకంబుగ నిల్వ
స్వాయంభువుండు విజ్ఞానిరత్న
మైనకర్దమమౌని నల్లునిగాఁ బరి
గ్రహియించి మిన్నందె గౌరవమున
అతఁడును శతరూప యతికష్టమున సుత
నెట్టులో మునిచేతఁ బెట్టి సహజ
విరహవేదన గెంటి వేయివిధంబులఁ
బుత్త్రిక నూరార్చి పోయి రంత

గీ. నాత్మదేశంబునకు; నెంతయైనఁ గాని
యొకరికొకరయి విడుతురే సకలసుఖము
లాత్మగేహంబు భోగంబు లవనియందు
నిలచు తాత్కాలికప్రేమవలన జనులు. ౬౭

క. బిందుసరోవరతీరము
నం దాశ్రమ మొండు నిలిపి యత్యంతసుఖా
నందనిధానము గాఁగను
నందుండెను గర్దమర్షి యతివయుఁ దానున్. ౬౮

ఉ. ఉండి కులక్రమానుగత మున్నతసౌఖ్యనిధాన మైనయు
చ్చండతపోధనంబును బ్రశస్తవిరాగసుయోగసంపదల్
మెండుగ సంగ్రహించును నిమీలితనేత్రుఁడు దివ్యచక్షు వా
ఖండలతుల్యవైభవము గల్గఁగ నాతి సపర్య సల్పఁగన్. ౬౯

గీ. లక్ష్మి నారాయణునకుఁ బార్వతి శివునకుఁ
బలుకునఁబోఁడి బ్రహ్మకు భక్తితోడ
సేవచేసెడివిధము హర్షించి మించి
వారిఁ దలదన్నఁ దలఁపందు వారిజాక్షి. ౭౦

క. సతి ముక్తిఁ గాంచఁగనుటకు
వ్రతములు నుపవాసవితతి వలయునె? తలఁపన్
బతియే సమస్తమనుసు
వ్రతనిష్ఠయె చాలుఁ బరమభాగ్యము లందన్. ౭౧

మ. తరుణీరత్నము భక్తియుక్తి ఘనతాత్పర్యంబునన్ స్నేహత
త్పరతన్ నాధుసపర్య చేయుచును గ్రోధద్వేషలోభాదిదు
ష్పరివారంబును గెల్చి యుత్తమమహాసాధ్వీత్వముంగాంచి య
చ్చెరువుం గొల్పును జూచువారికి శుచిశ్రీనూత్న తేజంబులన్.

మ. మునిమూర్ధన్యుఁ డమానుషప్రతిభచే మోక్షాకరాత్మజ్ఞతా
ఘనయోగంబున విష్ణుసత్కృప మహాగంభీరుఁడై దివ్యశ
క్తి నివిష్టుం డయి దివ్యదృష్టియుతుఁడై తేజోమహారాశియై
యనిపించుం బరమేశుఁ డీతఁడె యనన్ వ్యక్తాత్మనిష్ఠాదులన్. 23

మ. ఒకనాఁ డాతఁడు వత్సలత్వమున నెంతో ప్రేమ తొల్కాడ నం
తికమం దున్న సతీవతంసమును బ్రీతిన్ లాలనం జేసి "యో
శుకవాణీమణి! నా కసూయ యగు నిన్ జూడంగ నీవంటినాఁ
తుక, సాధ్వీమణి, నుత్తమవ్రతను నెందున్ జూడ నేకాలమున్. 24

ఉ. నాకృపఁ జూఱగొన్న లలనామణి వోట సమస్తభోగముల్
నీ కిట లభ్యమౌను దరుణీ! తమిదీఱఁగఁ గోరుకొమ్ము త్వ
ష్ణాకలితుల్ కనుంగొనని సంపద లెల్లఁ గరస్థమౌను దృ
ష్ణాక్రమనిర్జితాత్ములకు సాధ్వి! జగంబున నూహచేయఁగన్. 25

గీ. వలయునవి కోరుకొమ్ము సర్వంబు నేను
నీ కొసంగుదుఁ దన్వంగి! నిరుపమాన
నిత్యశుశ్రూషచేత ననిత్యదేహ
నిర్మమత్వముచేతఁ దన్పితివి నన్ను" 26

చ. అని పలుకన్ గటాక్షకలితాననపద్మము లజ్జపెంపునన్
వినమితమున్ మనోహరము నిస్తులకాంతియుతంబు గాఁగ న
వ్వనరుహగంధి స్నేహసహవాసము లందిన సౌహృదంబునన్
వినయము పెంపునన్ బలికె విహ్వలతాభయభక్తియుక్తులన్. 27

సీ. "ప్రాణేశ! నీమృదుపదకంజములె చాలు
క్షణికంబు లైన భోగంబు లేల!
యోగీశ! నీకృపా యోగంబె చాలును
క్షణికంబు లైనభోగంబు లేల ?

మౌనీంద్ర ! త్వద్భక్తి మహితచిత్తమె చాలు
క్షణికంబులైన భోగంబు లేల ?
జ్ఞానిచంద్రమ ! భవత్సాహచర్యమె చాలు
క్షణికంబులైన భోగంబు లేల?

ఇన్నియును నీ వెఱింగియు నిట్లు నన్నుఁ
గోరుకొమ్మన నిరసింప ఘోరదోష
మగును నే నెట్లు పలుకంగ నౌను దేవ !
సర్వవిషయజ్ఞ ! తెలియు నీ శక్తి నాకు. ౭౮

సీ. నియమవృత్తిని నిన్ను నిరతంబుఁ గొల్చినఁ
దనుకార్శ్య మది రవంతయును లేదు
నిద్రావిహీననై నిత్యంబుఁ గొల్చినఁ
మాంద్యంబె కలుగ దేమాత్రమైన
నిరుపమత్వత్సేవ నిరశననై యున్నఁ
గలుగ దేమాత్ర మాఁకలియు దప్పి
నిత్యోత్సవశ్రీల నెగడు నీకడ నున్నఁ
గల్గ వాధివ్యాధి కల్మషములు

గీ. వర్షశతములు కడచినఁ బరమపుణ్య!
త్వన్మహాసేవ నున్నయుత్తమతవలనఁ
దరుణసంపద సడలదు; పరమహేయ
కామవాంఛాదికంబులు కడలుకొనవు. ౭౯

గీ. ఇదె మహాభాగ్య మిట్టులే యింక నుండి
భవ్యభవదీయ సఖ్యసంపదను మెలఁగఁ
గోరుకొందును కాని, దేవా! రహస్య
మొంపు కల దది తలపోయ మెండు భయము. ౮౦

క. నవమోహానుండ వగునీ
ప్రవిమలతనుసౌఖ్య మంద భావము పోవన్
మిపులన్ భయమగు దానన్
ధవ! సంతతి కలుగు నన్నుఁ ద్యజియింతు వనన్. ౮౧

క. సంతతి కలిగెడుదాఁకను
గాంతను గవగూడి యుందుఁ; గాముకవృత్తిన్
సుంతైనఁ గనక పిదప ధ
రింతును సన్న్యాస మను కెంజెంగితి మున్నే. ౮౨

ఉ. కావునఁ బ్రాణనాథ! నను గావఁగఁజూచెద వేని యాత్మ సం
భావనయుండెనేని ననుఁ బాయకయుండుము వంశవర్ధనా
భావము లేక పుత్త్రికలు పై సుతుఁడున్ జనియించి పెద్దవా
రౌవయసుల్ గడించి మనునంతకుఁ దీర్పుము నాదుకోరికల్. ౮3

గీ. పద్మపత్త్రాయతాక్షునిఁ బడసి సుతుని
గాఁగ నాతఁడు నాకు మోక్షం బొసంగు
దాఁక న న్నేలుకొనుము వాత్సల్య దృష్టి
సన్న్యసింపుము తగ యథేచ్ఛంబు పిదప. ౮౪

క. ఇది యుచితం బని ధవ! నీ
మదిఁ దోఁచెన యేని నీవు మన్నింపుము నన్
సుదతిని బలికిన పలుకులఁ
గొదవయె కలదేని క్షమయె కోరుదు” ననఁగన్. ౮౫

క. “ప్రియురాల! నీతలం ప
ప్రియముల కాకరము కాదు ప్రేమంబున నా
క్రియ లెల్ల నే నొనర్తును
భయ ముడుగుము నీవు నిజము ప్రాణేశ్వరిరో!” ౮౬

మ. అని మాహేంద్రుఁడు తత్క్షణంబె నిజయోగానూనసత్త్వంబునన్
ఘన దీవ్యన్మణి నిర్మితంబు సుభగాకారాత్మకోద్యాన శో
భ నవోదారము సౌధకేళిభవన ప్రౌఢంబు దివ్యంబు నౌ
వసితామగ్నవిమాన మొక్కటిని జూపన్ బత్ని తబ్బిబ్బుగాన్. ౮౭

క. కని "తరుణీ! బిందుసరో
ఘనజలములఁ గ్రుంకులిడుము కల్గును నీకున్
వనజాక్షి ! సకలఫలములు
ననుపమయోగం" బటంచు నాసతి యాయెన్. ౮౮

గీ. దేవహూతి ప్రవేశింపఁ దీర్థమందు
నచ్చెరువు గాఁగఁ దోఁచిరి మచ్చెకంటు
లతులసూక్ష్మాంశుధారిణు లై కిశోర
నవవయశ్శోభిత లగుకన్యాజనములు. ౮౯

క. "పరిచారికలము నీకో
తరుణీమణి ! సేవగోనుము తాత్పర్యమునన్
జరియింతుము కనుసన్నల
నరయుము కారుణ్యదృష్టి నమ్మా! మమ్మున్". ౯౦

చ. అని కమనీయహేమకలశాదులఁ గర్పూరవారిఁ దెచ్చి పెం
పున జలకంబు లార్చి సతిఁ; బుప్పొడి కస్తురి రాసి మేని క
త్యనుపమధూప మిచ్చి బహుళాభరణంబు లొసంగి పా
వనముగ వల్వలిచ్చి యతివన్ గయిసేసిరి వా రొకింతలో. ౯౧

క. నానారసపానంబుల
నానారుచిరాన్నభోజనంబులఁ దృప్తిన్
నానావిధముల నొసఁగియు
నానందాంబుధిని దేల్చి రతివలు నామెన్. ౯౨

గీ. అంతఁ గర్పూరహారతు లామె కొసఁగి
యుత్తమోత్తమ శయ్యపై నునిచి పిదప
నగణితసువాసనోపేత యామెదరికిఁ
గర్దమమునీంద్రుఁ జేర్చి రుత్కర్ష మొదవ. ౯౩

క. అతఁడును సహస్రవనితా
యుతుఁ డయి బహునవ్యశోభనోపేతుండై
ప్రతి లేనిమన్మథుం డయి
యతిశయదివ్యస్వరూపమం దొప్పాటయున్. ౯౪

గీ. సకలమును దోఁచె దేవహూతికి విచిత్ర
గతిగ నాపైని భర్తయోగప్రభూత
సృష్టిగా నామె చేడ్పడి చూడ నతఁడు
నామెతోడ విమానంబు నంత నెక్కె. ౯౫

గీ. అతనితో నామె నామెతో నఖిలకన్య
కాసహస్ర మధిష్ఠింప ఘనవిమాన
మాకస మ్మనఁ దారక లనఁగ వారు
కర్దముఁడు పూర్ణశశి నాఁగఁ గానఁబడిరి. ౯౬

వ. అనంతర మాతనికోరిక ననుసరించి ౯౭

చ. సకలదిగీశముఖ్యులకు సంతతదివ్యవిహారభూమియై
సుకముల కాలవాలమును సుందరదృశ్యవిరాజితంబు స
న్నికటసుధాతునిర్ఝరగతిన్ సమశీతలమై శుభ
ప్రకరము లిచ్చుమేరుగిరిపై నిలిచెన్ ద్రుటిలో విమానమున్. ౯౮

మ. అదియే పుష్పక మాతఁడే ధనదుఁ డాయబ్జాక్షులే దేవతా
మదిరాక్షీమణు లంచు నెంచి జనముల్ మార్మాటలోనే యిసీ
యది కా దిట్టిమహాద్యుతుల్ కలవె యక్షాధీశునెమ్మోని కీ
సుదతీరత్నము లెన్న నెంతటి మహాశుద్ధాంగు లం చుండఁగన్. ౯౯

మ. శరవేగంబున నందు నేఁగి సుమనోజైత్రంబునం జూచి య
బ్బురపాటొందఁగ నందు నిందుఁ గల యంభోరాసులన్ దివ్యసుం
దరముల్ కేళివనంబులన్ గని మహానందంబునన్ సర్వలో
క రహఃకేళులఁ దేలుఁదేలు ఋషి పొంగారంగ శృంగారముల్. ౧౦౦

గీ. పుండరీకాక్షుఁ బొడఁగన్న పురుషవరుఁడు
కర్దమమునీంద్రుఁ డతని కుత్కర్ష కలుగ
త్రిభువనంబులఁ గలదె ప్రాప్తింపనట్టి
యేపదార్థంబు కాని సమీక్ష చేయ. ౧౦౧

చ. తనప్రతిభావిశేషమున ధారుణిఁ గల్గిన కేళిభూములన్
గని కని యందు నిందుఁ దనకాంతను గేళులఁ దేల్చి తేల్చి పెం
పున దివిఁ గల్గు కేళివనముల్ గని లీలలఁ దేలియాడి య
మ్మునివరుఁ డేఁగుదెంచె నిజభూమికిఁ దృప్తసతీద్వితీయుఁడై. ౧౦౨

మ. శతవర్షంబులు వారు సౌఖ్యరసవర్షశ్రాంతులై యిష్టభో
గతతిన్ దేలిరి; దేవహూతి పతియోగప్రాభవం బెంచి సం
తతిఁ గాంక్షించెను; గర్దముం డతివసత్కాంక్షన్ నివారింపకే
సతిగర్భంబున నిల్పె వీర్యము నవాంశప్రాభవం బందఁగన్. ౧౦౩

క. అది మొదలుగ దినదినమును
మదిరాక్షికిఁ బెరుఁగఁజొచ్చె మహితం బగుసం
పద నాఁగ నాత్మగర్భము
త్రిదశులు మందారవృష్టి దివిఁ గురియింపన్. ౧౦౪

క. ఈవిధముగఁ గర్దమముని
సేవాఫల మనఁగఁదగిన స్త్రీసంతతి రా
జీవాక్షి దాల్చి కనె రా
జీవాక్షులఁ గాలవశముచేఁ దొమ్మంద్రన్. ౧౦౫

క. తొమ్మండ్రు సుందరాంగులు
తొమ్మండ్రును బూర్ణచంద్రతులితాస్యలు నా
తొమ్మండ్రును బద్మాక్షులు
తొమ్మండ్రును లక్ష్మితోడఁ దులతూఁగంగన్. ౧౦౬

గీ. హర్షమునఁ దేలి కర్దముఁ డాత్మపుత్త్రి
కలకుఁ బేర్లుంచె $_{1}$అనసూయ $_{2}$కళ యనంగ
$_{3}$శ్రద్ధ నా $_{4}$హవిర్భువు నాఁగ $_{5}$శాంతి యనఁగ
$_{6}$ఖ్యాతి $_{7}$క్రియ $_{8}$యరుంధతి నాఁగ $_{9}$గతి యనంగ. ౧౦౭

గీ. అమలశోభాయమానపద్మాకరమునఁ
దళతళల నీను శ్రేష్ఠపద్మం బనంగ
మణులలోపల నాయకమణివిధానఁ
దరుణచంద్రాస్య యానరుంధతి చెలంగు. ౧౦౮

క. జననీజనకులముద్దుల
కును వారు నిధాన మగుచుఁ గొమరుందనమున్
వినయాన్వితసౌశీల్యముఁ
గని పెరుఁగం దొడఁగి రతులగతిసంగతులన్. ౧౦౯

క. నవనవకాంతుల నీనుచుఁ
బ్రవిమలసరసీరుహప్రభాశోభితలై
పువ్విలుతుని నిశితాస్త్ర
ప్రవరంబులు నాఁగ వారు పరగుచునుండన్. ౧౧౦

గీ. బాల్యయౌవనమధ్య మావయసు వచ్చె
లలన లెల్లరు మిక్కిలి వెలయుచుండి
ఋషిసపర్యలు చేయ నూహింతు రహహా !
గతము తెల్పు ననాగతక్రమము నిజము. ౧౧౧

మ. పొరపొచ్చెంబులు లేక నెచ్చెలులుగాఁ బొల్పొంది వారల్ పర
స్పరవాత్సల్యవిశేషరాగములతోఁ బ్రాణంబు ప్రాణంబులై
పరమాంతఃకరణప్రవృత్తులను దివ్యప్రేమమును జూపుచున్
పెరుఁగం; జూచెద రెల్లరున్ బరమసంభావ్యంబుగా వారలన్. ౧౧౨

గీ. సానదీఱిన నవరత్నజాలము లని
పుటము వెట్టినబంగరుబొమ్మ లనియు
దివ్యకాంతులీను మెఱుపుఁదీఁగ లనియుఁ
దోఁచినటు వారిఁ జెప్పుకొందురు జనములు. ౧౧౩

మ. మునిశుశ్రూషలు మానికాంతలవ్రతంబుల్ నిత్యకృత్యంబులై
జనవంద్యం బగుసత్ప్రవర్తనమె సత్సమ్మానితాచారమై
వినతప్రక్రియ నాత్మవిద్యఁ గని తద్విఖ్యాతనిష్ఠాక్రమం
బొనరం జేసెడిదీక్షలే పనులుగా నొప్పారి రాకన్నియల్. ౧౧౪

గీ. కర్దమప్రజాపతి దివ్యకాంక్ష వలన
దేవహూతికిఁ బుట్టినదివ్యవనిత
లహహా! వారికిఁ గొఱఁతయే యమలగుణము
లవనిఁ దలిదండ్రులే బిడ్డలౌట నిజము. ౧౧౫

గీ. ఇది యగు నరుంధతీవసిష్ఠేష్టకావ్య
రాజమునఁ బ్రథమాశ్వాసరాజ; మీశ!
గురువరా! త్వత్కృపామృతభరితమామ
కీనవాఙ్మయ మిదియు నంకితము నీకు. ౧౧౬

# అరుంధతీ వసిష్ఠము

## ద్వితీయాశ్వాసము

శ్రీమద్గురువర ! సత్కరు
ణామంద సుఖప్రదాత ! అద్వైతపథ
శ్రీమహితచిత్త ! శ్రీస
ద్ధామామూల్య రసప్రవిష్ట ! ఆర్యమహర్షీ ! ౧

వ. తదనంతరకథాక్రమ మెట్టిదనిన. ౨

క. నవరత్నంబులపగిదిని
నవరసములరీతి వారనంతప్రభలన్
బ్రవిమలతనువల్లరులన్
మివులన్ జెలువొందుచుండి మెలఁగుచునుండన్. ౩

ఉ. కర్దమ మౌనిచంద్రమునిఁ గాంచి ప్రియంబున దేవహూతి సౌ
హార్దముతోడఁ బల్కెనిటు "లార్యఋషీశ్వర ! నీయెడందయా
మార్దవ మెంతయున్ బరమమాన్యము, నోట సుపుత్రికాత్మ స
మ్మర్దము కల్గెఁగాని పరమంబగుపుత్రధనంబు లోటయా. ౪

క. శ్రీరమణి సుమను మఱి వా
ణీరమణిని బోలు పుణ్యానిధు లగుసుతలన్
ఏరమణి గన్న నాయమ
గారవమును గాంచలేదు కనక సుపుత్రున్. ౫

గీ. పుత్రవతి యైనకాంతతోఁ బోలఁజాల
రతులితైశ్వర్యయుత లయ్యు నబల లెందుఁ
బుత్రికలు వేయి మందియౌఁ బుత్త్రుఁ డొక్క
నికిఁ దలంపఁగ లోచ్చంద్రు నీతినిధులు. ౬

మ. ఇహసౌఖ్యంబుల రోఁతపుట్టె నిఁక నే నిందుండఁగాఁ జాల నీ
కుహనాభోగము లల్పముల్; మఱియు నీకుం గోర్కి సన్న్యాసమా
నిహలోకంబున జన్మ మింకేదు తెఱంగే తెల్పి యుద్బోధ రూ
పహితుం డైనసుపుత్త్రు నిచ్చి కృప దేవా ! నన్ను రక్షింపవే!" ౭

క. అని విన్నవించు తరుణీ
మణి హృదయమెఱింగి కర్దమఋషీశుఁడు "నీ
యనుపమయోగంబున శ్రీ
వనజాక్షుఁడు పుత్త్రుఁడగును వారిజనయనా ! ౮

మ. నిరతంబున్ దలపోయుచుండు మతనిన్ నీగర్భమం దాతఁడే
వరజన్మంబును గాంచు నిన్ననుఁ బ్రోవంజాలు సంసారసా
గర బీభత్సమునుండి లోకములరక్షం దాల్చు సర్వానికిన్
దరుణీ ! కష్టమ ? నిన్ను నన్నుఁగరుణన్ రక్షించి దాటించుటల్". ౯

గీ. అన్నమాటలు విని యామె యమితమోద
మంది శ్రీపుండరీకుని నాత్మఁ దలఁచు
వ్రతములను బూని యుపవాసవితతి సలిపి
విష్ణుచింతను దినములు వెళ్లఁబుచ్చు. ౧౦

గీ. కొంతకాలంబునకు భర్త గురుకటాక్ష
కలితయగు నామె కార్దమకలిత తేజ
మంద నారాయణుం డామెయందుఁ జొచ్చి
గర్భగతజీవుఁడై యుండెఁ గరుణమెఱసి. ౧౧

క. కాలక్రమమున నాయమ
లీలామాత్రుండు లోకలీలారతుఁడౌ
శ్రీలక్ష్మీదయితుని నొక
బాలునిగాఁ గనియె నామె భాగ్యంబెంతో. ౧౨

గీ. కపిలమౌనిని నిజజనిక్రమవినాశి
నతులయోగప్రభూతుని నాదిదేవుఁ
గడుపు చల్లనియాతల్లి గాంచినంత
దివ్యచిహ్నంబు లెంతయుఁ దేజరిల్లె. ౧౩

క. మందారవృష్టిఁ గురిసిరి
బృందారకు లెల్ల గగనవీథిని బరవూ
నందినులై యప్సరసల్
సుందరముగ నాట్యమాడి చూపిరి ప్రీతిన్. ౧౪

చ. సరసజనాంతరంగములు సంతసమందెను; హోమవహ్ను ల
బ్బురముగ వెల్గి సుప్రభలపుంజము లయ్యెఁ; సముద్రముల్ కలం
కఱి సుభగంబు లయ్యెను; ఫలావళిఁ బుష్పములన్ నతంబులై
పరగెను వృక్షరాజి; ఫలవంతము లయ్యెను సర్వసస్యముల్. ౧౫

క. ప్రకృతికిఁ బరుఁడై వెలిఁగెడు
సుకృతులు జనియించునపుడు శోభిల్లెడియా
ప్రకృతికె యాకృతి నొసఁగిన
సుకృతియె జనియింప మిగుల శోభిలకున్నె. ౧౬

క. కపిలావతారవేళా
సుపవిత్రత నెంచి బ్రహ్మసూనులతో న
య్యపవర్గకాంక్షిఁ గర్దమ
తపస్విన్ దేవహూతి దర్శించి వెసన్. ౧౭

చ. "పరమపవిత్రులార ! భగవంతునిఁ బుత్త్రుని గాఁగఁ గన్న యో
గ రతులు మీరు మీ రెవనిఁ గాంచిరొ యాతఁడె దేవహూతి క
చ్చెరువుగ నిచ్చు మోక్షము; విశిష్టమతంబగు సాంఖ్యయోగమే
పరమమతంబుగా నిలుపు; భక్తులఁ బ్రోచును జ్ఞానదాతయై". ౧౮

(సశేషము)

క. అని చెప్పి కపిలదేవుని
మనమున కేక్కన్ నుతించి మఱి కర్దమునిన్
మనమార సంస్తుతించి య
తని యాత్మజులన్ విరించి తగఁ గని యనియెన్. ౧౯

చ. "సరసిజనేత్రలార! విలసద్గుణరాజితలార! మీర లా
పరమఋషీంద్రపత్ను లయి భాసిలఁగాంతురు దివ్యకీర్తులన్
బరఁగుదు రస్మదాదులకుభావన కందనిపూజనీయలై
కర మరుదైనమీకత జగత్త్రితయంబున కొజ్జబంతి యౌ. ౨౦

క. నాకంటె మిన్నలై సుభ
గాకారులునై యెసంగునట్టిమహర్షుల్
చేకొందురి మిమ్ము సతులుగ
లోకంబులు శుభములన్ వెలుంగఁగ మీచే." ౨౧

చ. అని కొనియాడి ధాత తనయాత్మజుఁడైనమరీచిమానిచం
ద్రుని గని "వత్స! నీవు కళనుం గొని పత్నిగ గార్హ్యధర్మజీ
వనమున సంతతిన్ నిలుపు భావ్యము నీ కిది నిన్ను నీమె దే
వునిగను గొల్చి కీర్తిరమఁ బొందును లోకులు సంతసింపఁగన్". ౨౨

గీ. అని విరించి మరీచికి నాజ్ఞచేసి
కర్దమునియింట విడిచి శీఘ్రమున నేఁగె
నారదాదుల నాత్మనందనులఁ గూడి
సకల పుణ్యాస్పదం బాత్మసదనమునకు. ౨౩

ఉ. అంతటఁ గర్దమర్షియు బ్రియంబును గాంచి మరీచిమాని న
త్యంతకుతూహలంబున సుఖాంబుధిఁ దేల్చుచు నాదరింపఁగా
నంతటిమానిచంద్రముఁడు నంతటిజ్ఞానియు నంత యోగ్యుఁ డా
వంతయుఁ గష్ట మందక యె యబ్బెఁగదా యని పొంగిపోయెదన్. ౨౪

గీ. కార్యమునయందుఁ గార్యము కలిసివచ్చు
ననియు సమవయస్కులు నని యందఱకును
నొక్కసారియె యుద్వాహ మొనరఁజేయఁ
దలఁచి వెదకం దొడంగు నుత్తమవరులను. ౨౫

మ. అనసూయాగుణగౌరవంబుఁ దలపోయం జొచ్చి సాదృశ్యస
ద్గుణసంపన్నుఁడు తుల్యరూపవిభవోద్భూతపరిశోభుండు స
జ్జనమందారుఁడు దివ్యశక్తినిధి విజ్ఞానప్రభావాఢ్యుఁ డౌ
మునితల్పం బగునత్రిమౌనిఁ దలఁ చెం ముమ్మాటికిం సంప్రీతిగన్. ౨౬

చ. అమలినకర్దమర్షి హృదయంబునఁ బుట్టినపూజ్యభావ ము
త్తమముగఁ బాఱి పాఱి వినుతం బగుసద్వ్రతదీక్ష నున్న య
త్రిమునిని జేరి యాతనికిఁ దీవ్రముగా జనియింపఁజేసె ను
త్తమతరుణీ వివాహదృఢతత్పరతం క్షణమాత్రలోపలం. ౨౭

ఉ. భావన కెంతశక్తి తలఁపం విలసిల్లునొ యారె, యంచు సం
భావనచేసి యత్రిముని - పావనకర్దమయోగశక్తిసం
భావన కాత్మ మెచ్చి యిఁక మానునె కాక వివాహ మంచుఁ గ
న్యావరకాంక్షఁ గర్దమగృహంబును జేరెను దక్షిణంబునం. ౨౮

మ. అహహా! మౌనితపఃప్రభావములు భావాతీతశక్తు ల్యన్నతుల్
విహితాత్మక్రియ లంతరార్థములు గంభీరంబు లూహింపఁ; బ్ర
త్యహముం దోఁతు రలోకజీవనులుగా నార్యర్షు లెన్నంగ లో
క హితశ్రేష్ఠులు వారె వారిఁ బొగడంగా నౌనె యెవ్వారికిన్! ౨౯

గీ. కర్దముఁడు దేవహూతి యుత్కంఠమీఱ
నత్రి కెదు రేగి యర్ఘ్యపాద్యంబు లొసఁగి
యుచితసంభావభావితు నొనరఁ జేసి
ప్రీతిఁ గూర్చిరి తాము సంప్రీతు లయిరి. ౩౦

గీ. శ్రద్ధ యనుకన్య కనురూపచరితుఁ డైన
వరు నరయఁగోరి కర్దముఁ డురువివేక
మునఁ దలంచెను నంగిరోమునిని మిగుల
నిశ్చలం బైనయాత్మలో నిమిషమాత్ర. ౩౧

చ. ఘన మగునిష్ఠ నాత్మ శితికంఠపరాయణమై చెలంగఁ బెం
పును గనునంగిరోముని యపూర్వముగాఁ గనియెన్ హృదంతరం
బున నొకయంతరాయమును బూనిననిష్ఠకు నంత దివ్యదృ
ష్టిని బరికింపఁ దోఁచిన దశేషభవిష్య కథావిశేషముల్. ౩౨

మ. అతిచిత్రంబులు దైవలీలలు మహాహంకారులై మానవుల్
మతిలో నెంతురు సర్వముల్ నిజకృతుల్ గా నాకు నేఁ డిట్టిస
ద్వ్రతభంగంబులు పెండ్లిబేరములు సంప్రాప్తించెఁగా! యంచు స
న్మతి నే తెంచెను గర్దమర్షికడ కా మాన్యాత్ముఁడున్ వెంటనే. ౩౩

గీ. కర్దముఁడు దేవహూతియుఁ గౌతుకమున
నతని కెదు రేఁగి యర్ఘ్య పాద్యంబు లొసఁగి
సర్వసత్కారము లొనర్చి సంతసమున
నాత్మమందిరమున నిల్పి రతులభక్తి. ౩౪

గీ. పూర్ణ సుగుణాబ్ధి యగుహవిర్భువును దలఁచి
తుల్యరూపగుణంబులు తోఁచినంత
ఘనుఁ బులస్త్యుని దలపోసెఁ గర్దముండు
క్షణము హృదిలోనఁ దలపోసి సన్మనీష. ౩౫

ఉ. అంతఁ బులస్త్యమౌనికి హృదంతరమందునఁ జెప్పరాని య
త్యంతముదంబు గల్గ దరహాసము పుట్టఁగ నాత్మలోన ని
శ్చింతఁ దలంచినన్ నిరవశేషము బోధపడెన్ సమస్తమున్
వింతలు దైవలీల లని వేమఱు లెంచి పులస్త్యుఁ డాత్మలో. ౩౬

గీ. బయలుదేఱెను గర్దమప్రభునిఁ జేర
నాతఁడును దేవహూతితో నర్ఘ్యపాద్య
సత్క్రియలతోడ నెదురేఁగి సంతసమున
నాదరించెను వచ్చినయంత నతని. ౩౭

క. గతి యను నిజపుత్త్రికనం
గతి కర్దముఁ డెంచఁ బ్రీతి కడలుకొనంగన్
మతిఁ దోఁచెఁ బులహమౌనియు
వ్రతులకు సదసద్వివేక వైభవ మరుదే ! ౩౮

మ. పులహుం డాత్మతపఃపరాయణుఁడునై పొల్పొందువేళన్ దలం
పులు పైఁబడ్డఁ గలంగ మానసము నెమ్మో మెఱ్ఱనై క్రోధసం
కుల మయ్యెన్; దన కిట్లు విఘ్నములు చేకూరం గతంబేమి యం
చలఁతిం బోక కరంబునం గొనియె శాపాక్షేపవాగ్ధారలన్. ౩౯

ఉ. ఇంతటిలోన నాంతరపుదృష్టి నిగుడ్పఁగఁ గర్దమర్షిశు
ద్ధాంతరసౌహృదంబు గననయ్యెను వానికి బోధ యయ్యె వృ
త్తాంతము సర్వమున్; మివులఁ జిమ్మెను దవ్వుల శాపవారి య
త్యంతముదంబునన్ బయనమయ్యెను బెండ్లికి నీశ్వరాజ్ఞ గాన్. ౪౦

గీ. కర్దముఁడు దేవహూతియుఁ గడలుగొన్న
కౌతుకంబున నెదురేఁగి గౌరవమున
నర్ఘ్యపాద్యాదు లందించి యాదరించి
పులహు నిలిపిరి గృహమునఁ బొలుపుమిగుల. ౪౧

క. కమలాసన చోదితుఁడై
సమరూపవయోనుకూల సమరసభావ
ప్రమదాంతఃకరణుల ను
త్తమవరులను గర్దముండు ధన్యుం డేఱెన్. ౪౨

క. క్రియ యను తన కూర్చెడు క
న్నియకును గర్దముఁడు కూర్చె నిరుపమనిష్ఠా
నియమవ్రతుఁ డగు క్రతువును
వయసును రూపంబు గుణము వఱలఁగ సమమై. ౪౩

ఉ. ఖ్యాతి యనం జెలంగుతనకన్నియ కంతటఁ గర్దముండు వి
ఖ్యాతతపఃప్రభావుఁడు సమంచితవిజ్ఞుఁడు రూపమన్మథ
ఖ్యాతుఁడు ప్రీతచిత్తుఁ డగునార్యు భృగున్ బతి కాఁగ నెంచినన్
బ్రీతి నతండు వచ్చె నురరీకృతిఁ గర్దముఁ డాత్మ మెచ్చఁగన్. ౪౪

క. శాంతంబు రూపు దాల్చుట
శాంతి యనం జెలఁగు నాత్మజను గర్దముఁ డ
త్యంతముఁ గూర్చెడునామెను
స్వాంతమునం దెంచి చూచె సరిపడుభర్తన్. ౪౫

గీ. తఱచి చూడఁగఁ దోఁచె నథర్వుఁ డనెడు
నుత్తమతపోధనుండు మహోత్తమగుణి
కర్దముఁడు వానిఁ గాంక్షించె గాఢముగను
నాతఁడును బ్రీతి విచ్చేసె నందుకొఱకు. ౪౬

ఉ. కన్నియ రూపుఁ గోరు నధికంబుగఁ గోరును దండ్రియున్ మహా
భ్యున్నతసద్గుణౌఘమును నున్నతసంపదఁ గోరుఁ దల్లి యి
ట్లన్నియు నాత్మ నెంచి తనయల్లురఁ గూర్చెను గర్దమర్షి యి
న్నిన్నియు నొక్కచోఁ గలఋషీంద్రుల నాత్మమహత్త్వ మెట్టిదో!

మ. సుదతీరత్నములందు శ్రేష్ఠమయి తేజోరాశియై కామ్యముల్
మది వర్జించి తపఃప్రభావమున సమ్మాన్యాత్మయై యొప్పుచున్
ముద మొప్పన్ విహరించుచున్ వెలయుపూవుంబోఁడి పుణ్యంబులన్
బ్రోదుల్ సేయు నరుంధతీరమణి కేపుణ్యుండు ప్రాప్తించునో? ౪౮

క. అని కర్దముఁ డత్యంతము
మనమునఁ దలపోసెఁ దుల్యమహిమాన్వితు నె
వ్వనిఁ బ్రార్థింతునో యని నె
మ్మనమునఁ బొడకట్టెఁ డయ్యె మహితుఁ డెవండున్. ౪౯

గీ. కలఁడు కలఁడు వసిష్ఠర్షి కలఁ డటంచు
నెంచుచుండును గాని యేరీ ? తదీయ
దివ్యతేజంబు సైరింపఁ దివురవార
లనుచు భయమందుఁ దలపోయ నతని నితఁడు. ౫౦

చ. భువనములందుఁ బొల్పెసఁగుపుణ్యుల నెల్లర నుత్తమర్షులన్
మిగులఁ బ్రసిద్ధులై చనుమనీషుల నెంచి వసిష్ఠమౌనియే
తనును బరిగ్రహింపఁ గడుధన్య నరుంధతి నంచు నెంచి యా
ప్రవిమలమానసాంబురుహుఁ బ్రార్థనచేసెను గర్దమర్షి తాన్. ౫౧

ఉ. కర్దమమౌని ప్రార్థనముఁ గాంచి వసిష్ఠుఁడు దివ్యదృష్టి సౌ
హార్దముతోడఁ గర్దమగృహాంగణభూమికి నేఁగుదెంచినన్
గర్దమదేవహూతు లతిగౌరవ మొప్ప సమాదరించియున్
మార్దవ మొప్పఁ బల్కియును మాన్యతఁ గొల్చి రనంతభంగులన్.

క. కరుణాళుఁడై వసిష్ఠుఁడు
పరమవినీతిని గ్రహించి పరిచర్యల నా
దరమేదురతను గాంచెను
అరుంధతిని సుగుణభూషణాంచితరూపన్. ౫౩

ఉ. కాంచినయంత నామె తనకాంత యటంచు గ్రహించి యాత్మలో
నెంచెఁ బరీక్ష చేయ ధర నంతటిరత్నమహత్త్వమైన నొ
క్కెంచుక గీటుటాయిపయి గీచినయంతటఁ గాదె వ్యక్తమౌ
నంచు వసిష్ఠమౌని; యిది యౌఁ గద ! యుత్తమభంగి యెన్నఁగన్

గీ. "ఓయి కర్దమ! నీయింట నున్న వారె
యిసుక వంట యొనర్చెడియిగురుఁబోండ్లు?
అట్టు లైన మనోభీష్ట మగును మనకుఁ
దెలుపు" మనఁ దెల్లపోయిరి లలన లెల్ల. ౫౫

గీ. తండులంబులు తెచ్చినఁ దగినరీతి
వండిపెట్టంగ వనితలు వలఁతు లగుదు
రంతియే కాని యిసుక నేయింతి వండఁ
గల దనుచు నూఱకుండిరి లలన లెల్ల. ౫౬

గీ. ఇతనికోరిక తీరనియెడల నేమి
సంభవించునో యని భయసంభృతుఁ డయి
కర్దముఁడు తెల్పె నీమాట కంబుకంఠి
యగు నరుంధతి కామె యి ట్లనియెఁ బ్రీతి. ౫౭

క. "ఇది యెంతటిపని? తండ్రీ!
మది సంశయ ముడిగి చెప్పుమా యా ఋషికిన్
ముద మొదవ వండిపెట్టుదు
నిదె యిమ్మని యిసుకఁ దెచ్చియిమ్మా! నాకున్." ౫౮

శా. ఈమాటల్ విని కర్దముండు మదిలో నెంతో ముదం బంది యా
భామారత్నము చేయఁజాలు నని చెప్పంబోయె నమ్మౌనితో
ఏమో? యెంతటి శక్తి యున్నదియొ! మేలేకాద యట్లైనచో
నీముష్టింపచుఁ డిట్లనన్ గతము లున్నె యంచు లోకుల్ వెసన్. ౫౯

చ. ఎవరికిఁ దోఁచినట్లుగ నెల్లరుఁ బల్కఁగొనన్ వసిష్ఠుఁ డ
య్యువిద కొసంగె నాయిసుక నొప్పుగఁ గొల్చి సమంచితంబుగాఁ
దవిన తెఱంగునన్ నలువిధంబుల భక్ష్యము లేహ్య చోష్యముల్
మివు లగుపానముల్ జలుప లేమయుఁ గైకొని భక్తిపెంపునన్. ౬౦

గీ. ఇది యపూర్వము దీనినె ట్లీపడంతి
చేయఁజాలునో చూత మచ్చెరు వటంచు
సిద్ధసాధ్యులు దేవతల్ శ్రేణి గట్టి
యంబరంబున నిల్చిరి సంబరమున. ౬౧

ఉ. ఈచెవి నాచెవిం బడి యనేకజనంబులు మౌనిశేఖరుల్
చూచి తరింత మంచుఁ గడుఁ జోద్యమటంచును జేరవచ్చి సం
కోచము లేక యమ్ముని నకుంఠితతేజుని జ్ఞానమూర్తి భా
షాచతురాననున్ గని ప్రశంస యొనర్చిరి భక్తియుక్తులై. ౬౨

మ. తరుణీరత్న మరుంధతీవనిత చేతఃప్రీతిగా మౌనిశే
ఖరుఁ డైనట్టి వసిష్ఠుఁ డిచ్చునిసుకన్ గైకొంచుఁ బాత్రంబులన్
నరిగా నాల్గిటఁ బోసి భక్ష్యమును జోష్యం బంతటన్ లేహ్యముల్
వరపానీయములన్ బొనర్చె క్షణకాలంబందు నేర్పొప్పఁగన్. ౬౩

ఉ. ఆయమచేతిచల్వ యది యట్టిదయేమొ క్షణంబులోన నా
ప్యాయపుభక్ష్యచోష్యములు నయ్యెను లేహ్యము లయ్యె నంతఁ బా
నీయము లయ్యె నయ్యిసుక; నిశ్చయ మిట్టి పవిత్రహస్తముల్
చేయఁగ లేనిదెద్ది యని చిత్తరులై కరులైరి చూపఱుల్. ౬౪

చ. ధణధణ దేవదుందుభులు తద్దయు మ్రోసె, సురాళిఘంటికల్
గణగణ మ్రోఁగె, దూర్యయుగళంబుల నాదము లొప్పె, నప్సరో
గణముల యాటపాటలును గమ్మని నృత్యములున్ జెలంగె, నా
క్షణమునఁ బుష్పవర్షమును గాఢముగాఁ గురిసెన్ బొరింబొరిన్. ౬౫

మ. దిశ లెల్లన్ శమితంబులయ్యెఁ దమయుత్సేకంబులన్ వీడి స
దృశమున్ గాంచఁగ శాంతమున్ గనియెసంద్రంబుల్, సుహృత్త్వాళికిన్
వశమయ్యెన్ సకలేంద్రియంబులును సంప్రాప్తించె లోకాళికిన్
బ్రశమానూనసుఖం బరుంధతి యొనర్పన్ వంట చిత్రంబుగన్. ౬౬

మ. జయనాదంబుల దేవకామినులు పుష్పవ్రాతముం జల్లఁగా
భయభక్తిప్రతిపత్తులన్ ఋషిసమీపప్రాంతముం జేరి "ఓ
ప్రియమౌనీశ్వర ! సిద్ధమయ్యెను మనోభీష్టంబు తీరంగ వం
ట యిదే ర"మ్మని చేరఁజీరెను వసిష్ఠబ్రహ్మ నక్కాంత తాన్. ౬౭

శా. "సంతోషించితి నేల భోజనము ? నీసాంగత్యమే కోటివేల్
కాంతా ! నే నిదె పత్తునిప్పుడె లసద్గంగా జలాపూర్ణ మ
త్యంతప్రీతిద మీకమండలువుఁ జేతం బూని నా రాకప
ర్యంతం బిద్ది గ్రహించి యుండు"మని తానందించె నమ్మౌనియున్.

క. అందించిన నాకాంతయు
నందించి మహాప్రసాదనయసంగతిఁ దా
నందికొనె నాకమండలు
వందక సందేహ మించుకైనను భక్తిన్. ౬౯

మ. జలపూర్ణంబగునాకమండలువు హస్తం బందునం బట్టి యా
లలనారత్నము నిల్చె నమ్మునియు సంలక్షించి యక్కన్నె న
మ్ములవేగంబున నేఁగె నెచ్చటికొ యేమో యెందుకై యేఁగెనో
తెలియన్ రాదటఁ బ్రొద్దు క్రుంకినను నే తేఁడయ్యె నేపాటికిన్. ౭౦

క. దినములు కడచనెఁ బక్ష
మ్మును నిండెను నెలలుకూడఁ బోయెను గానీ
మునిమ్రుచ్చు రాకపోయెను
వనితామణి యేకదీక్ష వదలక నిలిచెన్. ౭౧

ఉ. తిండియుఁ దిప్పలున్ గనక దీర్ఘదినంబులు వాసరంబు ల
ట్లుండి చలింపదయ్యె "నిటు లొప్పదు దాని నటుండ నిచ్చి యో
యండజయాన ! తిండి తిని యాపయిఁ జేయుము నిత్యకృత్యముల్
దండితనంబు వీడి యనఁ దా బదు లాడదు కంటఁ జూడదున్. ౭౨

శా. రాఁడయ్యెన్ మునిరాజు జాడ కనఁగా రాదయ్యెఁ దన్వంగి యి
ల్లేఁడుల్ పూఁడులు నేఁగుదెంచినను గానీ దీక్ష యేమాత్రమున్
వీడంజాలక యుగ్రనిష్ఠ నిలువన్ వెన్వెంటనే లోకముల్
పేడెత్తెన్ నిజధర్మముల్ తొలఁగఁగాఁ బెంపేది రార్యర్షులున్. ౨౩

మ. కలగెం దోయధు లెల్లఁ జక్కనినదుల్ గాంభీర్యముల్ వీడి కాఁ
కలఁ దేలం దొడఁగెన్ జగం బులిసె శోకం బందె భూదేవియున్
వెలవెల్పోయె దివాకరుండు ఋషిసద్బృందంబు లెల్లన్ మన
శ్చలనం బందెను తాఱుమాఱయె సమస్తం బింక వేయేటికిన్. ౨౪

ఉ. కర్దమమౌనిచంద్రుఁ డధికంబగు ప్రేముడిఁ జేరవచ్చి "నీ
దుర్దమ నిష్ఠచే జగ మధోగతి పొందఁగ నున్న దమ్మ ! యీ
దుర్దశ మాన్పఁగాఁ బరమదుస్సహ మీతప మింత మాను నీ
గర్దమమౌనిపుత్త్రి వని గాసిలి తిట్టుదు రట్లు కానిచో". ౨౫

మ. అని యెంతెంతని వేఁడుకొన్నఁ జెవియం దావంతయున్ జేర్ప దే
మని మాటాడదు లోక మెట్లయిన నేమౌ నాకు నానిష్ఠ నా
కును జాలున్ బలుమాట లేల యిఁక నొక్కో నాఁగ నాదివ్యదీ
క్షను మానంబె సమస్తమున్ దెలుపునాఁగా నుండె సత్కాంతయున్.

గీ. తండ్రి ప్రార్థించి విఫలుఁడై తలఁచె లోన
నిట్టి దుర్దమవ్రత నిజం బెంచి చూడ
నాకు గౌరవహేతువే నాక కాదు
సకలలోక సంరక్షిణి సత్య మంచు. ౨౬

గీ. తండ్రి ప్రార్థించి విఫలుఁడై తప్పుకొనినఁ
దల్లి ప్రార్థించె మిక్కిలిఁ దా నరుంధ
తీరమణి పక్షపాతంబు తేటపఱుప
దయ్యెఁ దలిదండ్రులందు భేదంబుఁ జూపి. ౨౭

గీ. ఋషివతంసులు నొకరొక్కరే క్రమమునఁ
"దల్లి! యుడుగుము నీదీక్ష దయదలిర్ప
లోకముల నేలు" మన్న నాళీకనయన
యతనితోడిద లోక మంచాత్మఁ దలఁచు. ౭౯

మ. తలఁపఁ గొందఱు దీక్షయే యెఱుఁగ రేధర్మంబునుం జూడ రా
ష్ట్రులు వారల్ కడు హీను లెన్నఁగను మందుల్, కొందఱీదీక్షయం
దలఁతిశ్రద్ధను జూపి బాధ యగుచో నావంక కే చూడ, ర
త్యలఘుల్ సువ్రతముత్తముల్ విడువ రేయాతంక మేతెంచినన్. ౮౦

ఉ. ఈగతి నాయరుంధతి యహీనమహావ్రత దీక్షచేత స
ద్యోగ మహాగ్ని వెల్వడి మహోన్నతభంగి సమస్తలోకముల్
క్రాఁగఁగఁ జేయుచుండ సురకామినులుత్తలమంద నింద్రుఁ డా
వేగముతోడ నేఁగి కడు వేఁడె విరించిని రక్ష సేయఁగన్. ౮౧

మ. చతురామ్నాయము లొక్కపెట్టునను ఘోషల్ పెట్టఁ బద్మాసనుం
డతులప్రౌఢిమఁ గోలుపోయినటు లాహా! యంచుఁ జింతించుచున్
మతి దిట్టంబొనరించుకొంచు నిజహంసారూఢుఁడై కర్దమ
ప్రతికూఁతున్ వెదకందొడంగె మది సంభావించి యేతత్కృతిన్. ౮౨

గీ. నలువ విచ్చేసి యాయరుంధతిని గాంచి
"బిడ్డ! యుడుగుము. నీమనోభీష్ట మేమి?
జగము లల్లాడిపోయె నీసరణి తగునె?
మాను వ్రత" మని మఱి బతిమాలుకొనియె. ౮3

గీ. నలువయంతటివాని నైనను గనంగ
నిష్టపడదాయె మాటాడ నెంచదాయె
నాయరుంధతి నిలుచుండి నట్లె నిలిచి
పట్టినకమండలువు నట్లె పట్టియుండె. ౮౪

ఉ. ఈమెఁ గదల్ప నింక వెఱ వేమియు లేదని బ్రహ్మ యాదిగా
నా మహితర్షిచంద్రులును నద్భుతకంఠనినాద మేర్పడన్
"ఓమహనీయతాపస ! ఋషీశ ! వసిష్ఠమహర్షి ! శీఘ్రమే
యీమహిమాస్పదన్ గనఁగ నిచ్చటికే పఱతేవె సత్కృపన్.

ఉ. నీకృప లేనిచో బ్రదుకనేరము దేవ ! తృణంబుకూడ నీ
యాకృపగల్గుచోఁ దృణమ య్యేనియు మేరుసమానమే యగున్
మాకయి లోకసంకటము మానుపుకోసము వేగ వచ్చి నీ
వీకమలాయతాక్షి వ్రత మింతకుఁ బూర్ణసమాప్తి చేయవే ! ౮౬

గీ. లోకసంరక్షణార్థమై నీకు జన్మ;
మరయ మముబోంట్ల రక్షించు టగు వ్రతంబు;
కుంభసంభవ ! విచ్చేసి కొమరుమిగులఁ
బెండ్లికొడుకవు కాఁగదే ప్రియ మెసంగ". ౮౭

క. అని వేఁడుకొనుచు నుండఁగ
మునిమూర్ధన్యుఁడు వసిష్ఠ మునిచంద్రుఁడు న
వ్వినువీథినుండి దిగియెను
ఘనతేజము దిక్కులందుఁ గ్రమ్ముకొనంగన్. ౮౮

ఉ. వచ్చి నమస్కరించిన తపస్వులకెల్లఁ బ్రతిప్రణామముల్
మెచ్చి యొనర్చి పద్మభవు మేదురభక్తి నుతించి వెంటనే
యచ్చపలాక్షిఁ గర్దముని యాత్మజఁ జేరి "లతాంగి ! యీఁగదే
వచ్చితి నాకమండలువు భద్రము చేసితి విచ్చ మెచ్చితిన్". ౮౯

క. అను నవ్వసిష్ఠుపలుకులు
విని కన్నులు విచ్చి చూచి వినమితశిరయై
తనచేతికమండలువును
మునిచేతం బెట్టి కదలి మ్రొక్కె నతనికిన్. ౯౦

మ. సుమవర్షంబులు దేవతల్ కురియ యక్షుల్ కిన్నరుల్ నృత్యముల్
సమదస్ఫూర్తి నొనర్పఁగా మఱియు గంధర్వుల్ జయధ్వానముల్
ప్రమదం బారఁగఁ జేసి గీతవితతిం బాడంగ దివ్యంబు ది
వ్య మటంచున్ జనముల్ నుతింప శుభముల్ప్రాప్తించె లోకాళికిన్.

గీ. "పడఁతి! లె మ్మింక శుభములు పడయఁగలవు
సిద్ధ మిది త్వన్మనోభీష్టసిద్ధి యగుట"
యని వసిష్ఠుఁ డరుంధతిహస్తయుగళిఁ
బట్టుకొని లేవనెత్తెను బ్రణయ మొప్ప. ౬౨

క. అహహా! మహర్షి పాణి
గ్రహణం బొనరించినంతఁ గన్నియ కపుడే
స్పృహ వచ్చి సిగ్గు గదిరినఁ
దహతహపడి లోని కరిగెఁ దరుణులు నవ్వన్. ౬౩

గీ. "తడయఁ జూడకు మింకఁ గర్దమమునీంద్ర!
శీఘ్రమున నే వివాహసంసిద్ధిఁ గూర్పు"
మంచు నానతియిచ్చె నాయంచరౌతు
అవ్వసిష్ఠుఁడు వినఁ జెఱునవ్వుతోడ. ౬౪

మ. సుముహూర్తం బది నిశ్చయించుకొని యచ్చోసర్వసంభారముల్
సమకూర్చెన్ ఋషికర్దముండు పరమాశ్చర్యంబుగన్ మున్నె యా
త్మమహత్త్వప్రతిపాదకుల్ పరమసంభావ్యాత్ము లైనట్టి మా
నిమహాశ్రేష్ఠులుఁ జేయఁజాలనివి యున్నె యెట్టికృత్యంబులున్.

గీ. పెండ్లిపెద్దలు చనుదెంచి విడిసి యుండి
రతనిగృహమందు జామాత లండ అతని
నుతితతులఁ దన్పువా రైరి నతు లొనర్చి
యతఁడు గావింపఁ బెండ్లిండ్ల నబ్బురంబె! ౬౬

మ. తనతో మ్మంద్రుకోమార్తె లిట్లు పరమాత్మజ్ఞానవిజ్ఞానులన్
ఘనమౌనీంద్రుల రూపమన్మథుల నిష్కామ్యాత్ములన్ దేవదే
వనికాయస్తవనీయులన్ ద్రిభువనప్రఖ్యాతులన్ బ్రహ్మజీ
వనులన్ భర్తలుగా గడించి రని యాబ్రహ్మర్షి యుప్పొంగుచున్.

ఉ. మునికులసంప్రదాయమున మున్నటు లొప్పినశాస్త్రపద్ధతిన్
గని మనమందుఁ గర్దముఁడు కాంచి సదాచరణంబు పీనిమే
ళనమునఁ జేయఁబూనెను జెలంగి వివాహమహోత్సవంబులన్
వినుతవిధాన మొప్పఁగఁ బవిత్రగతిన్ సుమనోనుకూలతన్. ౯౮

గీ. బ్రహ్మమునుముందు నతనియాధ్వర్యవమున
సర్వదేవతాఋషిగణసన్నిధాన
మందు దివ్యవైభవముతో నలరెఁ గర్ద
మాత్మజలపెండ్లి లోకంబు లలరఁ బ్రీతి. ౯౯

చ. మునివరసామగానరవముం బురుడించుచుఁ గోకిలాంగనా
జనకలగానమాధురులు షడ్జములన్ బెనుపొందుచుండఁగా
ననవరతంబు నధ్యయనమందునఁ బాల్గొనుకీరరాజముల్
గొనకొని కల్పఁగాఁ దొడఁగెఁగూర్మిశ్రుతిన్ మునివేదఘోషతోన్.

ఉ. నృత్తము నల్పునచ్చరలు నెమ్మికులం బొనరించునాట్యసం
పత్తిఁ దదీయనూతనవిపర్యయముల్ కనినన్ మనంబులన్
హత్తుకొనంగ మైమఱచి యాటలు మాని నిజాత్తశాస్త్ర మా
వృత్తియొనర్చుకోఁ దొడఁగ నెల్లరు నవ్విరి సిగ్గుచేటుగన్. ౧౦౧

చ. అరవిడి నూత్నశోభల నయాచితభంగి దిశాముఖంబులన్
బరఁగఁగఁ జేయు పద్మములఁ బావనభంగిఁ గరేణుయూథముల్
సరసముగా గ్రహించి సుమసంగతిచే గజమాల లెన్నొ చే
కురిచి నవీనదంపతులకున్ గయిసేయును భక్తియుక్తులన్. ౧౦౨

ఉ. మందలు మందలై తమ కమందసుఖం బిది యంచుఁ జెప్పఁగా
డెందములందు నెంచియొ కడిందిపొదుంగులతోడ దివ్యగో
బృందము లాప్రదేశమునకే పఱతెంచి పయస్సులన్ మహా
నందముతోడుతన్ గురిసి నందినులే యనఁ బొల్చు నిమ్ములన్.

గీ. పండి యుండినపండు లీపెండిలికయి
నిల్చియున్నవో నాఁగ నా నిమిషమందె
రాలిపడిపోయి యామునిరాజిభుక్తి
కొఱకుఁ జూపును వారి కకుంఠభక్తి. ౧౦౪

గీ. పిల్లతెమ్మెరలనె పంపి మెల్లమెల్ల
వారినును మేనులకు సుఖప్రమద మీయ
వాయుదేవుఁడు చూపు హృద్భక్తియుక్తి
తనసదాగతిత్వమ్ము సార్థకము గాఁగ. ౧౦౫

మ. తనకున్ రక్షకులై జగంబుల నితాంతప్రేమ వాటించుచున్
మనువారే కద ! వీర లంచుఁ దనకున్ మర్యాదగా వారికిన్
దనభక్తిన్ బ్రకటింపఁగా శమితతీక్ష్ణత్వంబునన్ మందమై
యినుఁ డొప్పున్ సమశీతలుం డయి గుణాకృష్టాత్ము లిట్లుండరే !

గీ. స్వచ్ఛమై శారదాభ్రంబుచంద మగుచు
నొప్పె వినువీథి నీలిమ నొప్పమిగిలి
సరసహృదయంబులను బోలి సరసులందు
నీరములు గాంచె స్వచ్ఛతన్ నిశ్చలతను. ౧౦౬

ఉ. ఈగతిఁ బంచభూతములు హృష్టములై మఱి హృష్టి నిచ్చి తే
జోగరిమన్ జెలంగఁ బరిశుద్ధమనస్కులు సంతసింపఁగా
నాగమవేదులై చెలఁగు నార్యఋషీశులఁ జెట్టవట్టి శో
భాగురుతన్ జెలంగెఁగి శుభప్రదకర్దమ పుత్రికామణుల్. ౧౦౭

గీ. సృష్టికర్తయు వారి నాశీర్వదించి
యాత్మధామంబునకు నేగె నంతమీఁద
తక్కుదేవత లాశీర్వితానములను
గురిసి వారలపైఁ జేరుకొనిరి దివిని. ౧౦౯

వ. ఆ పిమ్మట యథావిధివివాహసంస్కారానంతరము
దేవహూతీకర్దములు తమతోమ్మండ్రుముద్దు
గుమ్మ లగుకూఁతుండ్రను దొమ్మండ్రుగు
రల్లుండ్రకు నొప్పగింతలు పెట్టి కన్నులనీరు గ్రమ్ముకొన ౧౧౦

ఆ. "ముద్దుబిడ్డలార! ముదముతోడుత నేగి
పతులవెంట వారె గతులు కాఁగ
మమ్ము మఱవకుండ మహితయశస్సును
పార్జనమ్ముఁ గాంచి వఱలుఁ డమ్మ!" ౧౧౧

చ. అని తమకన్యలన్ బతుల కర్పణచేసి సగౌరవంబుగా
ననుపమవస్తుసంతతు లనంతము వారల కిచ్చి నిత్యనూ
తనములు కట్టఁబుట్టములు ధనమ్ముతొ వారి కొసంగి మేలిభూ
షణము లొసంగి పంపిరి ప్రశాంతమనస్కత వారి నెల్లరిన్. ౧౧౨

గీ. తుద కరుంధతీదేవిని ముదము మీఱ
నవ్వసిష్ఠునితోఁ బంపునవసరమునఁ
గనులవెంబడి నశ్రువాహినులు పాఱ
దేవహూతికిఁ గర్దమధీమణికిని. ౧౧౩

గీ. ఇది యగునరుంధతీవసిష్ఠేష్టకావ్య
రాజమున ద్వితీయాశ్వాసరాజ్య మీశ!
గురువరా! త్వత్కృపామృతభరితమావు
కీనవాఙ్మయ మిదియు నంకితము నీకు. ౧౧౪

# అరుంధతీ వసిష్ఠము

## తృతీయాశ్వాసము

శ్రీగురు సాంబసదాశివ!
శ్రీగురు పరమాత్మ! జ్ఞానసిద్ధిప్రద! వి
ద్యాగురుచూడామణి! స
ద్యోగీంద్ర! మహానుభావ! యోగనిరూఢా! ౧

గీ. అది వసిష్ఠమహర్షి దివ్యాశ్రమంబు
భూతలస్వర్గ మన్న నా పోలుపులేమి
స్వర్గమందు నలంకార శాస్త్రవిదులు
ఉపమ కుపమానలోపమే యొదవునండ్రు. ౨

చ. అది సుమనోహరంబగు మహావనరాజ మటఁ సమస్తసం
పదలు విరాజిలుఁ సహజభంగి ననారతమున్ బ్రసూనముల్
మృదుల లతాళులఁ దమకు నెప్పుడు వాడుటయుఁ సుగంధముల్
వదలుట నేలపైఁ బడెడిపాటును లేక చెలంగు స్వచ్ఛతన్. ౩

మ. మునికాంతాతిలకంబు లాత్మపతు లాముష్యాయణుల్ చేయు దే
వనికాయార్చనకున్ శుచిస్మితముఖవ్యక్తాత్మతాచున్ లతాం
త నికృంతం బొనరింప వచ్చునెడ ధన్యత్వమ్ము భావించి ప్రీ
తిని బూసెజ్జల రాలు నాసుమతతుల్ దివ్యంబు లేతత్కృతుల్. ౪

గీ. స్వచ్ఛతయు లేక నిస్స్వార్థపరత లేక
కాంతి దాంతియు లేక కర్కశత మెలఁగు
నరులకంటెను బూజ్యముల్ విరులు తలఁపఁ
గాననే వానిఁ దలఁదాల్పఁగంట సతులు. ౫

ఉ. అందు వసంతకాలమె నిరంతరముం సుమనోనుకూలమౌ;
విందులు గూర్చు వీనులకు విశ్రుతిఁ గోకిలబృందముల్; మహా
నంద మొసంగునృత్యముల నమ్మెలు; కీరసమూహ మెల్ల దై
నందినమున్ బఠించు శ్రుతి నమ్రత చూపుచు మౌనిజాతికిన్. ౬

గీ. జాతివైరంబు లెఱుఁగ వచ్చటి మృగములు;
మాంసభోజన మొల్లవు ; మాయ కాని
మర్మమును గాని యెఱుఁగవు ; మానితతికి
సేవచేయు మహోన్నతస్థితి వహించి. ౭

గీ. నగరకల్మషవర్తులౌ నరులకంటె
నడవిలో నున్న మృగములే యధికము లని
నగరముల వీడి పూతవనమ్ము లందె
యాశ్రమంబుల నివసించి రార్యఋషులు. ౮

మ. ప్రియ మానిట్టి నిజాశ్రమంబును మహాప్రీతాత్ముఁ డౌచున్ వసి
ష్ఠయమిశ్రేష్ఠుఁడు దివ్యదీధితులతో సౌభాగ్యభాగ్యాన్విత
ప్రియకాంతా తిలకంబుతోడఁ జని చేరెన్ దేవతల్ పుష్పసం
చయవర్షం బొనరింపఁగాఁ బ్రకృతి తేజస్స్వాంతమై యొప్పఁగన్.

చ. చిలుక కోలంపుముత్తవలు చెందొవ ఱేకుల దండ లీయఁ గో
యిలపువుఁబోండ్లు కెంజిగురు లెల్ల సరంబు లొనర్చి భక్తినిం
పులు గులుకంగ నీయ మఱి ముద్దుగఁ బాటలు పాడ వారికిన్ లకో
రులు మఱి నమ్రముత్తయిదులున్ సమకూర్చె గృహప్రవేశమున్.

గీ. ఇటు లరుంధతీకాంతతో ఋషివరుండు
స్వీయ దివ్యాశ్రమంబును జేరి గార్హ
ధర్మపరిపాలనా వ్రతతత్పరుఁడయి
యుండె నాదర్శ భూతుఁడై యొరులకెల్ల. ౧౧

గీ. పంచ భూతంబులున్ భయభ్రాంతము లయి
వారిసేవాపరత్వంబె కోరుకొనియె ;
దివ్యసంసార జీవితదీక్షఁ బూను
ధీరవరులకు నెల్ల స్వాధీనమె కద ! ౧౨

మ. తనకున్ నిచ్చలు సేవచేయు తెఱఁగుల్, ధర్మాత్ము లౌవృద్ధు ల
ర్చనముల్ పొందెడి తీరులున్, మఱియు శిష్యవ్రాతమున్ సాకు నే
ర్పను, గోమాతృపదారవిందభజనంబున్ భూతసంప్రీతియున్
ముని మూర్ధన్యుఁ డరుంధతీరమణికిన్ బోధించి సంతుష్టుఁడై. ౧౩

గీ. "తరుణి! సంసారదీర్ఘ యాత్రాపరులకు
నరయ సులభంబు లౌనుపాయములు గలవు
శమదమాన్విత ధర్మమార్గమును బట్టి
పొందవచ్చు యాత్రానంద మిందువదన! ౧౪

గీ. పెంపునఁ దరించి యొరులఁ దరింపఁజేయ
సారవంతంబు నిజము సంసార మగును;
ఆత్మ కుక్షింభరత్వ కాషూవిల మగు
నీచసంసారమే సర్వనింద్య మగును. ౧౫

క. అసిధారావ్రత మగునో
బిసరుహపత్త్రాక్షి! పరమభీకరపాపా
లస మగు సంసృతిఁ గడచుట
విసమును నమృతంబు నిందు వెలయు లతాంగీ! ౧౬

సీ. ధర్మమార్గంబునఁ దవిలి సత్కర్మంబు
లీశ్వరార్పణబుద్ధి నెవఁడు చేయు
తుచ్ఛోపభోగసంతుష్టిఁ గాంక్షింపక
యింద్రియనిగ్రహ మెవ్వఁడందు
నియమవ్రతంబుల నిరుపమానంబుగా
నడపించుచుండు నెవ్వఁడు సతంబు
అతిథిదేవులసేవ యభ్యాగతసపర్యఁ
బరమవ్రతంబుగా జరపు నెవఁడు

గీ. వెలయు నాత్మావలోకన వృత్తి నవఁడు
తనువు-మనువుమ ద్వైతత్పరత నుంచి
యట్టివానికి సంసార మమృత మగును
కానివానికి విష మగుఁ గంబుకంఠి! ౧౭

గీ. రెండు విధముల నానంద ముండు సతివ!
ఇంద్రియానంద మొకటి నికృష్టమిదియె
ఇంద్రియాతీత మైన దోయిగురుఁబోఁడి!
రెండవది దివ్యమిదియె పూర్ణేందువదన! ౧౮

ఉ. కామవికారముం దగులుకాపురుషుండు వివేకహీనుఁడై
క్షేమముఁ గాంచలేఁడు దరిసింపఁగలేఁడు యథార్థతత్త్వముల్
నీమము నిష్ఠయుల్ నిలుప నేర్చినవాఁడె జయించుఁ గామముల్
గామవిజేతయే తలఁపఁగా నగు జ్ఞానవిశిష్టుఁ డోచెలీ! ౧౯

సీ. సకలవైదికకర్మ నికరంబు దీక్షతో
నొనరింపఁగా వలె నువిద! నరుఁడు
కర్మసంత్యాగి కాఁగారాదు నరుఁ డెప్డుఁ
గర్మఫలత్యాగి కావలయును
శ్రద్ధయు భక్తి యాచారంబు నిత్యసం
తోషంబు నరులకుఁ దోడునీడ
ఆత్మావలోకన మహరహాతపమును
బ్రహ్మనిష్ఠునిఁ జేయుఁ బడఁతి! నరుని

గీ. బ్రహ్మ నిష్ఠాగరిష్ఠ సౌభాగ్య మతివ!
అవని దుర్లభ మెంతవాఁడైనఁ గాని
బహుళగత జన్మసుకృత సత్ఫలమున కతన
లభ్యమగుఁ గోటి కొకని కోలలిత! యదుధీమా ౨౦

గీ. బ్రహ్మనిష్ఠులు గాంత్రు శాశ్వతతయశస్సు
అవ్యయానందపదము వారధివసించి
జన్మ మృత్యుప్రవాహంబు జాడఁగనరు
అతివ! యితరులు చెడవుర్వ లట్టివారు. ౨౧

శా. పూతబ్రహ్మకులంబునం బొడమి సంభూతాత్మ విజ్ఞాన వి
ఖ్యాతిం గాంచి జగజ్జనావళికి నత్యంతంబు నాదర్శమా
కీర్తిన్ వర్తిలకున్న లోకము చెడున్ రిక్తప్రయత్నంబగున్
నాతీ! బ్రహ్మకు సృష్టికార్యమిటు కానన్ జేయు మేతత్కృతుల్.

గీ. తరుణి! నినుఁ జెట్టవట్టి యీ దర్శగార్హ
ధర్మనిర్వహణంబునఁ దనర నడుగు
పెట్టినాఁడను సద్గుణప్రేరిత వయి
నడపు భారంబు నీయది నళిననయన! ౨౩

చ. ఇతఁడొకశిష్యరత్నము మహీస్థలి నొంటిపదంబుపైని ని
ల్చి తపము వేయిరేయిం డ్లొనరఁజేసెను సాధ్వి! యితండు భస్మసా
త్కృతు నొనరించి మన్మథుని నీశ్వరుఁబోలి మహోగ్రనిష్ఠ సు
వ్రతియయి వెల్గు నిట్టిగతివారలు మత్ప్రియశిష్యులో సఖీ! ౨౪

మ. నియతాహారులు నిర్జితేంద్రియులు నిర్ణిద్రప్రమోదాన్వితుల్
ప్రియకాంతామణి! శిష్యరత్నములు నిర్లిప్తుల్ భవత్సేవకుల్
ప్రియపుత్రాగ్రణు లట్లు వారికి లసత్ప్రీతిన్ సుమృష్టాన్న స
త్క్రియఁ దుష్టింబొనరించుచుండుము జగద్విఖ్యాతినొప్పారుచున్."

మ. అని బోధింప నరుంధతీరమణి బ్రహ్మానంద సంప్రాప్త భ
ర్తను సాష్టాంగ నమస్కృతిన్ దనిపి శ్రద్ధాభక్తి సంయుక్తయై
వినుతించెన్ "పతిదేవ! నీ దయిన భ్రూవిక్షేపమున్ బట్టి నీ
కనుసన్నన్ భవదాజ్ఞలన్ నెరపుదున్ గావుత నీ వెప్పుడున్. ౨౬

మ. జగదభ్యర్చిత తావకీనపదసంస్పర్శం బదారాధనం
బొంగడొందంగల దేవదేవ! కరుణాపూర్ణుండవై త్వత్కృపా
పగ నాపైఁ బ్రవహింపనిమ్ము మఱి యాపై నేమియుం గోర నిం
పగుణాకార పరాత్పర ప్రభునిఁగా సమ్యగ్గతిం గొల్చెదన్. ౨౭

ఉ. నాదగు పూర్వపుణ్యమున నాదగు దివ్యతపః ఫలంబునన్
నీదగు పాదపద్మతతి నిస్తులభక్తిని వ్రాలఁగంటి భా
గ్యోదయ మిద్దినాకుఁ గరుణోదధి! నీ కడఁగంటి చూడ్కి యా
హ్లాదపరంపరావహము నవ్యయసౌఖ్య నిధానమున్ ప్రభూ! ౨౮

గీ. కొలుచుకొందును నీపాద జలరుహములు
తలఁచుకొందును నీ నామ తారకంబు
నడచుకొందును నీదగు నడుగుజాడ
నిలుచుకొందును నీదు నిశ్చలమనంబు. ౨౯

చ. ఎఱుఁగుదు నీమహత్త్వము ఋషీశ్వర! తావకపాదపద్మముల్
మఱఁగి చరింపఁగందు బరమంబగు కీర్తిని జూఱగొందు మా
పఱ సకలాఘముల్ పరమహంస! నినుంగవగూడి హంసినై
నెఱపుదు జీవితాబ్ధిని ననింద్యవిహార మనంతకాలమున్. ౩౦

గీ. పరమపావన సద్బ్రహ్మపథ విహార!
భవము భవమున నేను దపం బొనర్చి
కాంచఁగంటిని భవదీయ కరుణ నిట్లు
శాశ్వతం బగు నీకటాక్షంబు దేవ! ౩౧

ఉ. తల్లియుఁ దండ్రియున్ గురుఁడు దైవము సర్వమునీవె యంచు నా
యుల్లమునం దలంచుచు మహోత్తమభంగి నొనర్చుచుందు సం
ధిల్ల మనః క్రియైక్యము వినిర్మలవాక్సముదంచితంబుగా
వల్లభ! నీసపర్యలు భవత్ప్రియపత్నిగ శాశ్వతంబుగన్. ౩౨

చ. తలఁపఁగ మూఁడులోకముల దంపతులందు నరుంధతీవసి
ష్ఠులె కడు మేలుబంతు లని సూరిజగంబుల శాశ్వతంబుగా
నెలకొనఁగాక దివ్యము ననింద్యమునైన యశోలతాంగి త
ద్విలసిత తావకీనసుపవిత్ర మనోజ్ఞము జృంభితంబుగన్. ౩౩

గీ. లలనలకు జీవితేశ్వరలాలనంబె
పరమపదముగదా! దేవ! పావన త్వ
దీయకరుణా కటాక్ష సందీప్తి సోఁకఁ
దేలియాడుదు నానంద దివ్యవార్ధి. ౩౪

గీ. పతి కటాక్షింప నేపాటియతివయైనఁ
గాంచు ననదృశశక్తులు; కాంతుఁ డహహా!
పరమ యోగీశ్వరేశ్వర ప్రభుఁడెయైన
నతని యాలిమహాభాగ్య మలఁతియె? ప్రభు!" ౩౫

చ. అని పలుకన్ వసిష్ఠుఁడు మహర్షి విభుం డెద సంతసించి యా
మెను బ్రియవాక్యసంపదల మిక్కిలి లాలనచేసి యాపయిన్
వినుత గతిన్ దొడంగె నతిభీకరమైనతపం బొనర్ప భో
జనమును నీరు నిద్రయును సర్వము వీడి మహావ్రతస్థుఁడై. ౩౬

మ. సహధర్మవ్రత చర్యకున్ దొడఁగె నాసాధ్వీమహారత్నమున్
మహనీయం బగురీతి భర్తృ పదపద్మస్ఫార సంసక్తి దు
స్సహ దీక్షం గొని కాంతిఁబూనియుఁ దపస్తప్తాంగియై యామె ప్ర
త్యహమున్ భర్తృతపోనవద్యతకుఁ బ్రత్యక్షప్రమాణంబనన్. ౩౭

మ. నవలావణ్య విలాసహాసములు చెన్నారంగ నొప్పారి సం
స్తవనీయం బగు యౌవనంబున మహాసౌందర్య సంశోభితా
ధవులం గూడి రహః క్రియాకలన మోదప్రాప్తి నున్మత్తలా
ట వరింతు ర్సతు లింతెకాని యిటులుంటల్ లోకసామాన్యమే ?

సీ. నిత్యోపవాస వినిర్మల దీక్షలే
షడ్రసోపేత భోజనము గాఁగ
బహిరింద్రియవ్యాప్తి పరిహృతానందంబె
భోగానుభవ సుఖస్ఫూర్తిగాఁగ
శీతవాతాతప శ్రేణి నుదాసీన
భావమే విజయభావంబు గాఁగ
నిశ్చంచల ధ్యాన నిహిత చిత్తమె సక
లేప్సితార్థ మహాభిహితముగాఁగ

గీ. దివ్యదంపతు లగువారి దీక్షవలన
దశదిశలు దివ్య తేజః ప్రదములుగాఁగ
తొలుత హిమగిరి తనయతోఁ దుహినధాత్రి
శివుఁడు పోల్చినరీతి వసిష్ఠుఁ డొప్పె. 3౯

గీ. పలుకఁ డేమియుఁ; జేతఁ జూపఁడు వలసిన
వస్తువులఁ; గనుసన్నలఁ బఱుపఁ; డైన
నెటులు గ్రహియించెడిదొ కాని యెల్లయవియుఁ
దెచ్చికిఁ గూర్చెడు నా యరుంధతి క్షణమున. ౪౦

చ. నిలిచినకాలనే నిలిచి నిస్తులమైన తపంబు పెంపునన్
సలలిత బాలభానుగతిఁ జక్కని కాంతులు గ్రక్కుచుండఁగన్
బులకిత దేహుఁడై పరమపూరుషు భక్తిని రక్తి వేదభా
షల నుతియించు చుండఁ బ్రశాంతి వసిష్ఠమహర్షి నిచ్చలున్.

గీ. జలద గంభీరనినదంబు సవదరించి
యతఁ డొనర్చెడు వేదసంస్తుతులు వినఁగ
దిశ లదరు రోదసియు నిండు దివియు భువియు
దద్దరిల్లఁగ బ్రహ్మనాదము జనించు. ౪౧

శా. ఆనందంబున నాతఁ డట్లొనరఁ జేయన్ బ్రహ్మనాదంబు ది
వ్యానందంబున నాశ్రమస్థల సమస్తాశావకాశంబు పెం
పూనన్ దివ్యాశమ ప్రశోభితమునై యొక్కుమ్మడిన్ జీవనం
తానంబుల్ లయగల్పు నాదమున కానందమ్ముతోఁ జక్కఁగన్.

క. ఆనాదము మేదురమై
కానన మొనరించు బ్రహ్మకాననముగ ది
వ్యానందులు వారే బ్ర
హ్మానందులు వారె యనఁగ నఖిలమునందున్. ౪౪

సీ. అమృతంబుఁ ద్రావ లే దనశనవ్రతమున
క్షుత్పిపాసలఁ ద్రోలఁ జూచె నెట్లు ?
కాయకల్పము లేదు కమనీయ విగ్రహా
దివ్యదీధితిని జెందినది యెట్లు ?
సిద్ధౌషధాదులు సేవింపనే లేదు
దేహబలంబుఁ జెందినది యెట్లు ?
మాయ మంత్రంబుల మఱఁగినదే లేదు
సర్వశక్తులుఁ గాంచఁ జాలె నెట్లు ?

గీ. ఒక్కమానవుఁ డయ్యుఁ దా నక్కజముగ
నందె నెట్లు మహామహిమాదికంబు ?
అనుచు నివ్వెఱపడి వేల్పు లభినుతింతు
రావసిష్ఠుని బ్రహ్మ తేజో విశిష్టు. ౪౫

ఉ. ఆనుత దీక్షలోఁ గలమహత్త్వము మెచ్చి యెడంద నందినీ
ధేనువు చేరవచ్చి వినుతించె "వసిష్ఠ! మహర్షి చంద్ర! వ
త్సా! నిను మెచ్చి నీ కతిముదం బొదవింపఁగ వచ్చియుంటి నీ
దాసను నేను నీ కిఁక సదా యొదవించెద సర్వసిద్ధులున్. ౪౬

గీ. తలఁచినది తత్క్షణంబ సంతసముతోడ
నీకు సమకూర్చుచుండు మానీ! యసాధ్య
మేదియును గాదు దివిఁ గల్పవృక్షములును
మఱియుఁ జింతామణియును నామాత్రగావు. ౪౮

గీ. ఎవఁడు బ్రహ్మర్షి చంద్రుఁడై యెసఁగుచుండు
నతఁడె లోకసంరక్షణ మాచరించు
నట్టి యాతనికడనుండ నభిమతంబు
వచ్చితి వసిష్ఠ! నీ వట్టివాఁడ వౌట." ౪౯

మ. అని పల్కన్ విని సంతసంబున వసిష్ఠారుంధతుల్ భక్తిపెం
పున గోమాతకు సప్రదక్షిణముగా ముమ్మాఱు లేతెంచి "ఓ
జననీ! నీకృప కిట్లు పాత్రులము వాత్సల్యంబు పాటించి మా
కనుకూలంబుగఁ జేయు మెల్లవియు నంబా! నీకుఁ గైమోడుపుల్.

ఉ. తల్లివి నీవు లోకముల తల్లికిసైతము నందినీ! కృపన్
జల్లని చూపు చూచినను జాలును లోకము లుల్లసిల్లు సం
ధిల్లు శుభంబు లెల్ల భవదీయశరీరమె సర్వలోక సం
పల్లలనాత్మకం బమృతపానము నిన్ గనులారఁ జూచుటల్. ౫౦

గీ. మాకు వలసిన దేమి యమ్మా! తలంపఁ
దల్లి! నీ విట్లు వచ్చితి దయదలిర్ప
వలసినప్పుడు తలఁతుము వచ్చి నీవు
మేలు సంధింపుమమ్మ! మమ్మేలుకొమ్మ." ౫౧

మ. అని భక్తిన్ వినుతించు దంపతుల నత్యంతంబు దీవించి స
జ్జన మందారము కామధేనువు తథాస్తంచున్ యథేచ్ఛంబుగాఁ
జనియెన్; పిమ్మట మౌనిదంపతులు నిష్కామ్యాత్ములై దివ్యదీ
క్షను బెంపారి యొనర్పఁబూనిరి తపస్యన్ దీవ్రమార్గంబునన్.

సీ. ఒడయల కొడయఁడౌ నొడయనిఁ దలపోసి
యొడ లెఱుంగని యట్టి యొడమిఁ గనిరి
చూచుచుండియుఁ దాము చూడనిచూపును
జూడక చూచెడి చూపుఁ గనిరి
ఎఱుకల కెఱుక యగు నెఱుకను గడియించి
యెఱుకపుట్టువులుగా నెఱుఁగుకొనిరి
చేయక చేసియుఁ జేసియుఁ జేయని
చేఁతలలో జగజెట్టులైరి

గీ. వేనకును వేలు చట్టులై వెలయు నట్టి
గొప్ప జడదారి గుంపుల కెవ్వ డెఱుక
చూఱయిచ్చుచుఁ జుబ్బనచూఱ గాఁగ
బ్రతుకు మెలఁకువ లెఱిఁగి జంపతులు మనిరి. ౫౩

సీ. ఒకవంకఁ బతిదేవు నకలంక పరిచర్యఁ
దనుపుచుండును దాను దనియుచుండు
నొకవంక వ్రతపూర్తి సుకముగా నొనరించు
మునులకు నమృతాన్నముల నొసంగు
నొకవంక దేవతాదికపూజకై సుమ
ప్రకరంబు వివిధపత్త్రికలఁ గూర్చు
నొకవంక వ్రతముల సుకుమార దేహంబు
కృశముగాఁగను దపఃప్రశమ మందు.

గీ. ఆశ్రమప్రాంగణంబున నలరు పుత్త్రి
సదృశ మగు జంతుకోటి భిక్షములఁ దనుపు
నొక్కవంక, నరుంధతి పెక్కుగతుల
భువనకల్యాణి యగుచుఁ గాపురముసేయు. ౫౪

సీ. అమల తపోగ్నిమధ్యంబున వెలుఁగుచు
రెండవ బ్రహ్మనా నుండుచుండి
తన ధర్మపత్ని యుత్తమసేవచేయుచు
నుండఁ జూడనియట్టు లుండుచుండి
తనశిష్యగణము దర్శనమాత్రచేతనే
ధన్యులఁజేయుచుఁ దనరుచుండి
తనదివ్యతేజ మ్మాయనలేందు రవి మయూ
ఖముల నోడింపఁగఁ గ్రాలుచుండి

గీ. వాయుభక్షణ సాత్త్వికబలముఁ బడసి
నిత్యసంతృప్తుఁడై తానె నిఖిలజగము
నిఖిలజగమును దా నను నిజ మెఱింగి
వఱలుచుండు వసిష్ఠ దేవప్రభుండు. ౫౫

చ. అతని మహత్త్వముం దెలిసి యచ్చెరువంది మహేశ్వరుండు శా
శ్వతమహిమాస్పదం బఖిలశాసకశాసనదక్షమున్ మహో
న్నత మగు బ్రహ్మయష్టిని ముదంబునఁ బంపెను వచ్చిచేరె సం
తత పరిరక్షకం బగుచుఁ దా నది యప్పరమర్షి చెంతకున్. ౫౬

క. ముని మూర్ధన్యుఁడు తనయం
గసతో భయభక్తియుక్తిగౌరవముల న
వ్వినుతం బగు యష్టిఁ బ్రద
క్షిణమొనరించి కేలఁ గీలించె వెసన్. ౫౭

గీ. పాశుపతిచేతిశూలంబుపగిది, విష్ణు
కరకమలమందు వెలుఁగు చక్రంబు భంగి,
తగ మహేంద్రుని వజ్రాయుధంబు గతిని
బ్రహ్మయష్టి యొప్పును మునిప్రవరుచేత. ౫౮

ఉ. ఆదిసరస్వతీసహితుఁ డై నవిరించి మునీంద్రు మెచ్చి తా
నాదర మేదురంబుగను నక్షసరంబును బంపెఁ బంపఁగా
మేదురకాంతిపుంజముల మీఁదికిఁ జిమ్ముచువచ్చియద్ది స
మ్మోదముఁ గూర్పఁ జేరె మునిముఖ్యువసిష్ఠు మహాప్రదీపునిన్.

మ. ముని మూర్ధన్యుఁడు భక్తి మ్రొక్కి పరమామోదంబునం జేతఁ గై
కొని నేత్రంబుల కద్దికొంచు శుచియై, ఘోరాఘసంతానముల్
కని దా దవ్వులనుండి పాఱఁగ, జగత్కల్యాణదం బై యవి
ద్యను నాశంబొనరించు నక్షసరముం దాల్చెన్ మహోత్సాహియై.

గీ. ఇభవరదు మెడనుండు కౌస్తుభ మనంగ
శివుని మెడలోని పునుకలచే రనంగ
వెలయుచుండె వసిష్ఠునిగళమునందుఁ
బరమరుద్రాక్షమాలికావరము మిగుల. ౬౧

గీ. కరివరదుఁ డైన విష్ణుఁడు గారవమున
మునిశిరోమణి కనిపె నమోఘమైన
మేలిబంగారుతోడ నిర్మితము నయిన
యొక కమండలువును మహిమోన్నతంబు. ౬౨

చ. పరమవినీతిఁ గైకొనెఁ గృపాపరతంత్రుని విష్ణుఁ గొల్చి యా
పరమమునీంద్రుఁ డట్లమృత వారిని నింపిన కుండి భక్తితో;
కరుణవహించి యాఋషి శిఖామణి యందలి నీరుచల్ల స
త్వరశుభమౌను; గోపమున వారిని జల్లఁగ సర్వనాశమౌ. ౬౩

గీ. కామ్య మెఱుఁగని యాఋషిగ్రామణి యిటు
కరుణఁబడసి త్రిమూర్తుల వరము లందె
దివ్యమహిమాభిరాముఁ డై తేజరిల్లె
సాధ్వియైన యరుంధతి సహచరింప. ౬౪

చ. పిదప నరుంధతీరమణిపెంపును సొంపు పతివ్రతాత్వసం
పద గురుబోధముల్ బరమ మంగళరూపము మెచ్చియిచ్చలన్
త్రిదశపతివ్రతామణులు దీవనలన్ శచి దివ్యగంధమా
ల్యద మగు రత్నపేటికయు నంపి రరుంధతికిన్ బ్రియంబుగన్.

మ. రమయున్ బార్వతియున్ సరస్వతియు నారామామణుల్ మెచ్చియు
త్తమ సాధ్వీతిలకం బరుంధతిని సందర్శించి సౌభాగ్య భా
గ్యము నిత్యోజ్జ్వల యౌవనంబు సుకుమారాకారమున్ సర్వసౌ
ఖ్యము లందం గల శక్తి నిచ్చిచని రత్యంతప్రమోదాత్మలై. ౬౬

క. నవయౌవన సౌందర్యం
బవయవములఁ జిందులాడ నతిభక్తిమెయిన్
ధవునకు మ్రొక్కి నరుంధతి
నవయౌవన మందె నతఁ డనంతద్యుతులన్. ౬౭

క. దైవబలంబును మఱి వి
ద్యావిభవము జ్ఞానసంపదన్ గాంచి తప
శ్శ్రీవైభవ సంయుతులై
సేవించి రరుంధతీ వసిష్ఠులు గృహితన్. ౬౮

ఉ. పెక్కురు చక్రవర్తులకుఁ బెక్కురు రాజులకున్ మహీస్థలిన్
బెక్కురు రాజవంశ్యులకుఁ బ్రీతిగురుండు పురోహితుండునై
మక్కువ నాదరించుచు సమానుమభంగిని వారిఁబ్రోచుచున్
నిక్కపుదైవమై నెగడి నిస్తులకీర్తి వసిష్ఠుఁ డుండెఁగన్. ౬౯

క. భూజనులు సుఖం బుండిరి
రాజులు ధర్మాత్ములై విరాజిలిరి మునుల్
పూజితులైరి జగంబున
సౌజన్యమె వెల్లివిరిసె సంభావ్యముగన్. ౭౦

ఉ. ఒక్కమహర్షివర్యుఁడు మహోన్నతదివ్యతపస్యనుండఁగాఁ
బెక్కురు సౌఖ్య మందు టది పెద్దమె? రాత్రి విహాయసంబునం
దొక్కఁడు రోహిణీప్రియుఁడు జ్యోత్స్న విరాజిలుచుండువేళఁ బెం
పెక్కదె లోక? మల్లె రవి వెల్గ దినంబునఁ బొంగరే జనుల్? ౨౦

క. ఇంద్రాది దివిజనుతరా
జేంద్రులు పత్నులను గూడి యిష్టార్థములన్
సాంద్రత నందఁగ వచ్చి ము
నీంద్రుని సతిఁగొల్చి పోదు రిష్టావాప్తిన్. ౨౧

క. రాజు చెడి రాజ్య మెల్ల న
రాజక మగువేళఁ దానె రాజయి రాజ్య
శ్రీఁ జెట్టవట్టఁ బ్రజ లే
యోజను జెడకుండఁ బ్రోచుచుండును ఋషియే. ౨౩

గీ. రాజసంతతిలో గుణరాజితుఁ డగు
క్షత్రవీరుని కారాజ్యసంపద నిడి
మగిడి వచ్చును రాజ్యమమత్వమింత
యైన లేక వసిష్ఠమహర్షి వనికి. ౨౪

ఉ. కంటికి ఱెప్పవోలెఁ బ్రజఁ గాచుచుఁ దండ్రివిధాన నెప్డు, త
న్నంటఁగనీక రాజసుఖాశ లవంబును లోకసంగ్రహం
బొంటి నొనర్చు చుండి మహిమోన్నతి వెల్గువసిష్ఠమౌని ము
క్కంటి విధానఁ, దాను దనకాంతను గూడి జగద్ధితార్థియై. ౨౫

చ. అలఘుతపస్వి యైనమును లందఱుఁ బత్నులతో నరుంధతీ
లలన వసిష్ఠునిన్ గన సలక్షణభక్తి నరుంధతీవసి
ష్ఠుల సుకృతాశ్రమంబున విశుద్ధతపఃఫల మంద వచ్చి వా
రల పరిచర్యలన్ మిగుల రంజిలి పోదురు భక్తిఁగొల్చుచున్. ౨౬

శా. ఈరీతిఁ విలసిల్లుచుండిన మహర్షీంద్రుండు తా నాత్మలో
నారీరత్న మరుంధతీరమణి సౌందర్యంబు వీక్షించి సం
సార పరిస్ఫుట సత్ఫలం బొసఁగఁగా సంకల్పముం బూని య
న్నీరేజాసను నాజ్ఞనుం దలఁచి మున్గన్ రాగవారాన్నిధిన్. ౭౭

చ. పతియనురాగదృష్టి సతిపైఁ బడ నంతటి దాఁక నిట్టిసం
గతి యపురూప మశ్రిత మకాండశుభంబని మెంచుకాంతక
ప్రతిమముగా జనించె ననురాగము రాగమయాత్ములైన దం
పతులకుఁ దోడ్పడెన్ మదనపండితుఁ డెంతయు భక్తియుక్తులన్.

క. త్రికరణశుద్ధాత్ములు స
ర్వకళాబహుపారదృశ్వ వర్యులు వారల్
త్రికరణములు నేకముగా
సకలశుభముహూర్త వేళ సలిపిరి కేళుల్. ౭౯

క. తాపసరాజ్యంబును మఱి
భూపాలురలాజ్యలాభముం బొందినయా
తాపసదంపతు లందిరి
తాపాదికనిలయమౌ మదనరాజ్యంబున్. ౮౦

చ. తపమున ధర్మబోధమునఁ దత్త్వమునన్ గడుదిట్ట కల్పపా
దపము నిజాశ్రితాళి కని తా రమణీమణీ మున్నెఱుంగుఁగా
ని పతిని గామతంత్రముల నిస్తులుఁడున్ నిపుణుండటంచుఁ బా
నెపుడు నెఱుంగదార ! యిదియెంత యెఱుంగుట కామహర్షికిన్.

చ. పరమపతివ్రతామణి యుపాస్తహృదంతరవాంఛితార్థ సుం
దరి సుగుణాకరంబనియె తాపసి పత్ని నెఱుంగుఁగాని త
త్పరమరహఃక్రియా నిపుణతల్ మునుగాంచి యెఱుంగఁ డిప్పుడో
పరవశులైరి దంపతులు భవ్యపరస్పర శాస్త్రవిజ్ఞతన్. ౮౨

క. స్త్రీపశువు పురుషపశువును
జేపడి సంసారవృద్ధి చేయుట లేదా ?
యేపగిది భేదమేర్పడు
నా పసులకు మానవులకు ? నరయఁగ వలదే ? ౮౩

చ. నియమవిహీనులై పరమనింద్యత నిగ్రహ మింతలేక యా
మయముల కాలవాల మయి మారశిలీముఖదష్టచిత్తులై
వయసు వృథాయొనర్చు నరవర్గమెయౌఁ బశువర్గ; మిట్టిదు
ష్క్రియులకు నిగ్రహవ్రతిఋషీశులకుఁ గట! పోల్కి యున్నదే ?

చ. నిరుపమయౌవనంబు నతినిష్ఠుర నిగ్రహ నిశ్చలాత్ములఁ
బరమశివాంకితంబుగఁ దపఃక్రియలందు వ్యయించి యీశ్వరే
శ్వర పరిపూర్ణసత్కృపకుఁ బాత్రులు దివ్యులునై తదాజ్ఞచే
వరసుతులఁ గనంగ భయభక్తి రమించుట యెంత భాగ్యమో !

గీ. శుక్తిరజతంబుఁ గూడెడిసొంపు గదుర
స్వర్ణ సౌరభసంగమ సంగతి గన
పుష్ప సురభిళసంయోగము పురుడింపఁ
గూడి రప్పు డరుంధతీ కుంభభవులు. ౮౬

గీ. పుణ్యతార్తీయ పురుషార్థమును భజించి
యుల్లసిల్లి రరుంధతీ వల్లభు లిటు
కొన్ని వేలేండ్లు; వారల కూటమిని జ
నించె సుతశత మఖిలమునిప్రవరము. ౮౭

మ. తొలుతఁ బుట్టినపుత్త్రిరత్నము జగత్ స్తుత్యుండు శక్తిఋషి య
య్యలఘుబ్రహ్మమునీంద్రుఁ డొప్పెసఁగి భార్యారత్నముం గాంచియా
లలనారత్నమునన్ బరాశరుఁ దపోలక్ష్మీయుతుఁ గాంచఁగఁ
విలసిల్లెఁ ఋషివంశముల్ క్రమముగా విఖ్యాతవాసిష్ఠముల్. ౮౮

మ. పిదపం బుట్టిన పుత్త్రులెల్లరుఁ దపోవీరుల్ మహాభావులై
యుదితార్కోపమతేజులై వెలసి రీయుర్విన్ ఋషీంద్రావళిన్
సదసద్భేదవివేకులై చతురులై జ్ఞానప్రవిష్టాత్ములై
పొదలం జేసిరి వంశవర్ధనము నంభోరాశి చందంబునన్. ౮౯

గీ. కడుపుచల్లని తల్లియై క్రాలె నిట్లు
భువి నరుంధతి లోకైకపుణ్యసాధ్వి
మఱి వసిష్ఠుఁడుఁ బిదప సమ్మాన్యుఁ గూడి
తనరుచుండె వానప్రస్థ ధర్మరతిని. ౯౦

మ. జగదాశ్చర్యకరంబులైన కృతులన్ సమ్యగ్గతిం వేనవే
లుగ నాతం డొనరించెఁ బేర్కొనఁగఁ జాలున్ శేషుఁడో లేక స
ర్వగరిష్ఠప్రతిభా విశేషుఁ డెవఁడో బ్రహ్మాండనాథుండు; నే
యుగమం దన్యుఁ డెవండుఁ బేర్కొనఁగ లేఁడో హా! వసిష్ఠోన్నతుల్.

క. నిమిశాపము విశ్వామి
త్రముని పరాజయంబు ఋషివతంసుల ప్రోపున్
అమలిన రామ గురుత్వము
జమయూనే యతనికోటిసత్కృతులందున్. ౯౨

క. ఒక దివ్యనదీతీరము
నకుఁ జని ముని, యాలియున్ వినమ్రతఁ గొలువన్
వికచహృదయాంబుజుండై
యొక యాశ్రమమందుఁ బుచ్చుచుండె దినంబుల్. ౯3

క. ఆనది కావలియొడ్డున
మౌనిమణి యగస్త్యుఁ డుత్తమవ్రతదీక్షా
నూనుండై యేకాగిగ
మౌనితముగ వాయుభక్ష్యమాత్ర వసించున్. ౯౪

చ. అమలవసిష్ఠమౌని తనయాలిని గూడి నదిన్ దరించి పో
యి మహితదీక్షు నున్న పరమేశ్వరరూపు నగస్త్యుఁ జూచి త
ద్విమలపదాంబుజంబులకుఁ బ్రీతిని మ్రొక్కి సభార్యుఁడై వడిన్
సుమహితపూజ చేసి తముఁ జూచిన మౌనికి భక్తి నిట్లనున్. ౯౫

గీ. "నహుషహుంకారి! నీదుమౌనవ్రతంబుఁ
జెఱుపఁదలఁపము మముఁ గటాక్షించి మేము
నిత్య మొసఁగు నాతిథ్యముఁ స్వీకరింపు
మవలిమొద్దునఁ గలమయ్య!" యన నతండు. ౯౬

మ. జగదభ్యర్చితు లౌనరుంధతి వసిష్ఠబ్రహ్మ యి ట్లేఁగుదెం
చి గరిష్ఠం బగుపూజచేసి యడుగన్ సిద్ధంబె కా కన్య మె
ట్టిగతిన్ బల్కుఁడు నంచు లోఁ దలఁచి యట్లే నాఁగ నూపెన్ దలన్
మగునన్ గూడి వసిష్ఠుఁడున్ మరలె బ్రహ్మానందియై యింటికిన్.

క. అది మొదలు దినదినంబును
సుదతి యరుంధతి వసిష్ఠచోదితయై పెం
పొదవఁగ షడ్రససంయుత
పదార్థములు చేసి మునికి భక్తిని బెట్టున్. ౯౮

ఉ. పెట్టిన యాపదార్థములఁ బ్రీతిని గొన్నిటిఁ గొంచు మౌనిస
మ్రాట్టు భుజింపఁ బిమ్మట నమస్కృతిఁ దద్భరిభుక్తశేషమున్
గుట్టుగ నాయరుంధతి యకుంఠితభక్తిని నిల్లు చేర్చి తాఁ
బెట్టును భర్తకున్ బిదపఁ బ్రీతిఁ గొనున్ బతిభుక్తశేషమున్. ౯౯

చ. మునులకు నెల్లఁ బెద్ద లయి పూజ్యుల కెల్లను బూజనీయులై
యనుపమ విజ్ఞు లయ్యు నహహా! పరిపాటి సపర్యచేయఁగా
మునులకుఁ గోరుకొంద్రు బహుపూజ్యుల కెన్నఁడు గర్వముండునే?
ఘనులకుఁ బూజ్యుఁ డౌనతిథి కన్పడుకంటెను భాగ్యమున్నదే?

చ. అనుదిన మిట్లు చేయుచు గృహస్థమహోత్తమ ధర్మకర్మ మ
త్యనుపమదీక్షతో నతిథి యారయ దైవమె యంచుఁ గొల్చుచున్
మునికులముఖ్యులున్ వినయభూషణు లైనవసిష్ఠమౌనియున్
వనితలకున్ శిరోమణి యనందగునాతనిపత్ని యుండఁగన్. ౧౦౧

చ. ఒకదిన మిట్లరుంధతి మహోత్తమసంయమి యానగస్త్యమౌ
నికిఁ దనయాతిథేయమును నిస్తులభక్తి గ్రహించి పోవువే
ళకు నది పొంగి పాఱుచుఁ జలంబున నొడ్డులు దాయ దాఁట నే
రక వెనుదిర్గి వచ్చి మునిరాజు వసిష్ఠున కెల్లఁ జెప్పినన్. ౧౦౨

గీ. "తరుణి! యోడక నీవు వేగిరమె పోయి
మనవియొనరింపు మానదీమాతతోడ
నను సదాబ్రహ్మచారి పంపెను గటాక్ష
వీక్షణంబునఁ దెరువిమ్ము వేగ ననుచు. ౧౦౩

క. తెరు విచ్చును నీ కానది
వరనియమవ్రతుల కడ్డువచ్చుట కెపు డె
వ్వరు నోపరు చని రమ్మని
పరమర్షి వసిష్ఠుఁ డంప వనితయుఁ బ్రీతిన్. ౧౦౪

చ. హృదయమునం గుతూహలము హెచ్చఁగ వేగిర మేఁగుదెంచి యా
నదికిని మ్రొక్కి భక్తిఁ దననాథుఁడు చెప్పినరీతిఁ బల్కఁగా
ముదమున దారియిచ్చి నది పొమ్మని పల్కిన సంతసంబుతోఁ
బదపడి యామె పోయెఁ బదపద్మములన్ దడి యంటకుండఁగన్.

గీ. ఆమె కడచని యఱిగినయంత నదియుఁ
గడుభయంకర మైనవేగంబుతోడఁ
బాఱఁ దొడఁగెను సుడులతోఁ బ్రాభవమున
నెవ్వ రిఁక నన్ను వారింప నిల ననంగ. ౧౦౬

ఉ. కడువడి నాయరుంధతి యగస్త్యునిపాలికి నేఁగి భక్తితోఁ
గుడువఁగఁ బెట్టి యోగిరము గొందలమందుచు "దేవ! యెట్లు నే
వ్వడిఁ బ్రవహించునీనదిని వైళమ దాఁటుదుఁ జెప్పు మన్న న
ప్పుడు మునిమౌనమున్ విడిచి "ముందెటువచ్చితివమ్మ చెప్పుమా!"

క. అని యడుగ నరుంధతి భ
క్తిని దెల్పెను భర్త తనకుఁ దెలిపినరీతిన్
మునియును జిఱునవ్వొలయఁగ
ననియెన్ సమ్మోదముతోడ నయ్యంగనకున్. ౧౦౮

గీ. "ఉవిద! పల్కుము నిన్ను నిత్యోపవాసి
పంపినాఁ డని యానది పాయయిచ్చుఁ
దన్వి! యఱకాలు తడిగాక దాఁటఁగలవు
నిన్ను వారింపఁ గలవస్తువున్నె? జగతి." ౧౦౯

క. అని పలికిన మునిపత్నియు
ననుపమ మగుభక్తి మ్రొక్కి యాతని కరిగెన్
మును వచ్చినత్రోవనె వ
చ్చినఁ బొంగుచు నుండె నది విశేషత్వరతోన్. ౧౧౦

చ. కరములు మోడ్చి మ్రొక్కి మునికాంత నదీప్రియమాతకున్ భయం
కరముగఁ బాఱుచుండఁగ నగస్త్యుఁడు పల్కినపల్కు పల్క న
చ్చెరువుగఁ దత్క్షణంబె నది చిత్రముగాఁ దెరువిచ్చి పొమ్మనన్
పరముఋషీంద్రపత్ని పదపద్మము వాడక వచ్చె నింటికిన్.

గీ. అతిథిభుక్తాన్నశేషంబు నతిముదమున
భర్తకును బెట్టి భుజియించువఱకు నుండి
అతనిభుక్తాన్నశేషంబు నమృతమట్లు
కుడిచె నప్పు డరుంధతి కూర్మి మీఱ. ౧౧౨

చ. మనమున నాఁటియచ్చెరువుమాటలభావ మెఱుంగఁగోరి యా
వనిత యనంతరంబు పతిపాదము లొత్తెడివేళ భక్తి పెం
పున సుముఖాత్మఁ డైనమునిపుంగవు నిట్లడిగెన్ "మహాత్మ! నా
కును దెలుపంగదే ప్రియముఁ గూర్పఁగఁ గల్గినసంశయార్థముల్.

సీ. పరమేశ! మనకు నూర్వురు పుత్త్రు లెటు సదా
బ్రహ్మచారివి నీవు? పరమచిత్ర
మిది విని నది తెరు విచ్చుట మఱి చిత్ర
మీచిత్రమును మించు నింక నేను
నిత్యంబు నన్నాది నియతిఁ బెట్టఁగఁ దిను
నతిథి నిత్యోపవాసిత తలంప
నిది విని నది తెరువిచ్చు టింకొకచిత్ర
మీచిత్ర పరమార్థ మెఱుఁగఁ జెపుము

గీ. అనినఁ జిఱునవ్వు మెఱయఁ దదాననమునఁ
"గాంత! యిట్టివి ధర్మసూక్ష్మములు వీనిఁ
దెలియుదురు మాదృశులు ఋషుల్ తెలియ రన్యు
లిది యెఱింగింతు వినుము నీ వించుఁబోఁణి! ౧౧౪

సీ. ఋతుకాలమున నాత్మసతిఁ గూడి పెఱయుష్ణ
భ్రాంతిఁ బోనఁడు సదా బ్రహ్మచారి
యశన మబ్బకయున్న నబ్బిన సమముగా
నుండునాతండు నిత్యోపవాసి
మనలఁ గటాక్షింప మనయాతిథేయంబుఁ
గొనుఁ గాని వాయుభక్షుం డతండు
కావున నింతటి గౌరవం బేర్పడె
మామాటలకుఁ దన్వి మహి" ననంగ

ముగుల నాశ్చర్యముం జెంది మించుఁబోఁడి
యగునరుంధతి మఱియింతయాదరమున
నతిథిసేవయుఁ బతిసేవ యాచరించి
శాశ్వతయశస్సు గడియించె జగతియందు. ౧౧౪

సీ. తమపాదధూళి కొంచెము సోఁకినను గాని
యఖిలంబుఁ బావనం బై తలిర్ప
తమ్ము సమ్మానించి దర్శించుజనములు
నఘదూరు లగుచు దివ్యత గడింప
తమయనుగ్రహముఁ గొంచెముఁ గాంచువారైన
దివ్యభోగంబులఁ దేలుచుండ
త మ్ముపాసించుపుణ్యుల్ గూర్చినవారు
జ్ఞానులై పరమవిజ్ఞత గడింప

గీ. శాశ్వతంబుగఁ బరమ నక్షత్రము లయి
మూఁడులోకము లేలుచుఁ బొలుచుచుందు
రతులితాదర్శదంపతు లయి యరుంధ
తీవసిష్ఠులు నేఁటికి దివ్యధాత్రి. ౧౧౬

చ. ఇలను వివాహవేళ సకలేప్సితసిద్ధి కరుంధతీవసి
ష్ఠులె ఘనసాక్షులుర్ మఱి యశోవిభవప్రదులై యనేకపూ
జలఁ గొనుచుర్ వధూవరుల సంతతసత్కృపఁ బ్రోచుచుందు రీ
యిలకు నుమామహేశ్వరులు నెన్నఁగ ఛా రయి శాశ్వతంబుగర్.

గీ. ఇది యగు నరుంధతీవసిష్ఠాఖ్యకావ్య
రాజమునఁ దృతీయాశ్వాసరాజ మీశ!
గురువరా! త్వత్కృపామృతభరితమామ
కీనవాఙ్మయ మిదియు నంకితము నీకు. ౧౧౮

శ్రీ శ్రీ శ్రీ

# తుదిపలుకు

అరుంధతీ వసిష్ఠ మతిపవిత్రమైన పద్యకావ్యము. ఇందలి యితివృత్తము వివిధపురాణాంతర్గతము. ప్రధానకథ అరుంధతి జననము, బాల్యము, పరీక్ష, వివాహము, అరుంధతీ వసిష్ఠులసాంసారిక తపోజీవనము వారి యౌన్నత్యమును.

శ్రీలక్ష్మీనారాయణులు, ఉమామహేశ్వరులు, వాణీ హిరణ్యగర్భులు, శచీపురందరులు, అరుంధతీవసిష్ఠులు, సీతా రాములు సర్వకాలసర్వలోకపూజ్యు లగునాదర్శదంపతులు. భారతీయుల భాగ్యఫలములు, అరుంధతీవసిష్ఠులను గూర్చి యెంతయైన వ్రాయవచ్చును. వ్రాయఁగలను. కాని, నేఁటి వారి కల్పకాలసమాప్తములగు లఘుకృతులే కావలయును. అందుచే 'ముక్తసరి'గ మూఁడాశ్వాసములలో మూఁడు నూటపదియాఱుల పద్యములతోఁ బ్రధానకథఁ దెలిపితిని.

ఉత్తమకవులయడుగుజాడలలో నడువ నుబలాట పడుటకన్న నధికార్హత లేనియస్మదాదులఋషిగుణప్రశంస పేలవముగఁ దోఁచకపోదు. ఐనను, సహృదయు లిందలి గుణలేశమునే గ్రహించి యాదరింతురుగాక!

బు॥ వేం॥

# ఆ నం ద త రం గ ము

సముచితసత్కళాభ్యుదయసార మనంగ నరుంధతీవసి
ష్ఠము తనరారుచున్నది రసప్రథితంబగు కావ్యరాజమై
విమలమతిం బఠించునెడ విజ్ఞులకైనను జ్ఞానభిక్ష నె
య్యమున నొసంగుచుండును గృతార్థుఁడవైతివి వేంకటేశ్వరా!

చక్కనిశైలిలో మిగులఁజక్కనిపొందికతో మృదూక్తులం
జక్కఁగఁ బాదుకొల్పి వెదచల్లితివయ్య! అరుంధతీసతిం
జక్కఁగఁ జేసి వ్రాసితివి సొంపుగ నింపుగఁ బెంపుగాఁ గడుం
జక్కనికైత నీది కవిసత్తమ! నీ కివె ధన్యవాదముల్.

విమలవియన్నదీసరణి విశ్రుతమయ్యె నరుంధతీవసి
ష్ఠము రససౌకుమార్యమునఁ జక్కనిభావపరంపరాప్రవా
హముగతిచేఁ బవిత్రితను నారవితారకమై మహాప్రపం
చమున విరాజిలున్ బరమసత్కృతియై బుధకోటి మెచ్చఁగన్.

జటప్రోలు సంస్థానము. రా. షు. రాట్కావి.